
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 11 మార్చి 2025 | 5





ఎమ్మెల్సీగా సోము వీర్రాజు



అనూహ్యంగా ఎమ్మెల్సీ పదవి సోము వీర్రాజును వరించింది.. బీజేపీ నుంచి ఆయనను ఎంపిక చేశారు. ఈ మేరకు అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు విడుదల య్యాయి. దీంతో సోమవారం రాజధానిలో నామినేషన్ దాఖలు చేశారు.గత 2015లో ఒకసారి టీడీపీ బీజేపీ పొత్తు నేపథ్యంలో ఎమ్మెల్సీ పదవి వరించింది. ప్రస్తుతం కూటమితో పొత్తు నేపథ్యంలో ఈసారి ఎమ్మెల్సీ పదవి వరించింది.. దీంతో జిల్లాలో బీజేపీ బలం పెరిగింది. - మెయిన్‌లో

స్వామిని కోరుకొండ!

కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి.. కొండపై ఉన్న స్వామిని కొలిచేందుకు 615 మెట్లు ఎక్కి తండోపతండాలుగా భక్తజనం తరలివెళుతున్నారు.. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం స్వామి రథోత్సవం నిర్వహించారు.. పెద్ద ఎత్తున భక్తజనం గోవిందా..గోవింద అంటూ స్వామి రథాన్ని లాగారు.. రాత్రి ఆలయంలో కల్యాణం జరిపించారు.. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై కొలిచారు.. ఓం నమో నారసింహాయ అంటూ మొక్కారు.. ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ వరకూ నిర్వహిస్తారు. 6





సాగుతున్న రథోత్సవం.. మొక్కుతున్న భక్తజనం

ఆయువేగం!

చిన్నపాటి నిర్లక్ష్యం జీవితాలను అతలాకుతలం చేసేస్తోంది.. కుటుంబాలను తీరని దుఃఖంలో ముంచేస్తోంది.. ఒక్క ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే చూస్తే కనురెప్పల మాటున కన్నీటిని అదిమిపెట్టుకుని జీవచ్ఛవాల్లా బతుకుతున్న వారెందరో.. కష్టాలు తీరుస్తాడని.. తమకు అండగా ఉంటాడని.. తమను పున్నామి నరకం నుంచి తప్పిస్తాడని ఎదురుచూస్తుంటే.. చేతికందివచ్చిన కొడుకు లేడు.. ఇక తిరిగి రాడంటే ఎంత కష్టం.. ఆ బాధను ఆపడం ఎవరితరం.. అయితే ప్రస్తుత యువత మాత్రం ఇవేమీ ఆలోచించడం లేదు.. వాయువేగంగా వెళ్లిపోతున్నారు.. 18 నుంచి 30 ఏళ్ల మధ్యే ప్రాణాలను బలిపెడుతున్నారు.. ఈ మూడు నెలల్లోనే సుమారు 75 మంది యువత మృత్యువాతపడింది. ఈ ఆయువేగానికి కారణం ఎవరు.. ముందు తల్లిదండ్రులే. స్టేటస్ పేరుతో ఎక్కువ సీసీ బైక్‌లు కొనిచ్చేస్తున్నారు.. ఉడుకురక్తం.. ఆ బైక్‌పై రయ్ రయ్‌మంటూ వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.. తల్లిదండ్రులూ యువతే కాదు.. మీ పిల్లలకు తెలియజెప్పాలి. అతివేగం ప్రమాదమని హెచ్చరించాలి.



ఇక మాకు దిక్కెవరయ్యా : ప్రత్తిపాడు వద్ద ప్రమాదంలో మృతిచెందిన కుమారుడి వద్ద తల్లి రోదన



వేగం తీసిన ప్రాణాలు

నిన్న ఒక్కరోజే..
- లారీని ఢీకొన్న బైక్ యువకుడు మృతి
- బైక్ స్కిడ్ అయి ఇంటర్ విద్యార్థి మృతి

7



జగ్గంపేట వద్ద ఈ నెల 3న జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి

స్పీడుగా..పోతున్నారు!

- యువత ప్రాణాలు తీస్తున్న అతివేగం
- 3 నెలల్లో 75 మంది వరకూ మృతి
- అంతా 18 నుంచి 30 ఏళ్ల లోపువారే
- రోజురోజుకు పెరుగుతున్న ప్రమాదాలు
- ఎక్కువ సీసీ బైక్‌లే కారణం
- తల్లిదండ్రులూ తగ్గించాల్సిందే మరి

అమలాపురం/రాజమహేంద్రవరం/పిఠాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదం జరిగితే జీవితాలు గల్లంతే. ఆ ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే అప్పటిదాకా సాఫీగా సాగిపోతున్న కుటుంబం ఒడిదుడుకులకు లోనవుతుంది. కానీ.. లేకలేక పుట్టిన కొడుకు, అల్లారుముద్దుగా పెంచు కొన్న కొడుకు, చేతికి అందివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం జీవితాంతం దుఃఖాన్ని గుండెల్లో దాచుకుని రోజులు వెళ్లదీయాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అనేక రోడ్డు ప్రమాదాల్లో విద్యార్థులు, యువకులు అత్యధికంగా మృత్యువాతపడ్డారు. వరుసగా జరుగుతున్న ఈ ఘటనలన్నీ ఆందోళన కలిగిస్తుండగా, వీరి కుటుంబాలు గర్భశోకంతో తల్లడిల్లిపోతున్నాయి. ఈ విషాద ఘటనల్లో ఎక్కువశాతం అతివేగం లేదంటే ఏమరుపాటు కారణాలవ్వడం గమనించాల్సిన విషయం. అలాగే అత్యధిక ప్రమాదాల్లో మరణిస్తున్న యువకులు హెల్మెట్ ధరించకపోవడమూ మరో కారణం. మద్యం లేదా గంజాయి మత్తులో కొందరు కుర్రాళ్లు రాత్రిళ్లు మితిమీరిన వేగంతో వెళ్లి ఆగి ఉన్న వాహనాలను ఢీకొనడంతో చనిపోతున్న ఘటనలు జరుగుతున్నాయి. బైక్ రేసింగ్ మరో కారణంగా కనబడుతోంది. ఇలా అనేక రకాలుగా యువత రోడ్డు ప్రమాదాల్లో మరణించి ఆయా కుటుంబాలను శోకసంద్రంలో ముంచెత్తుతున్నారు. దీనిపై అధికారుల పూర్తి పర్యవేక్షణ లేకపోవడం, కొన్నిచోట్ల హెచ్చరికలు చేస్తున్నా యువకులు లక్ష్యపెట్టకపోవడం వల్ల కూడా వారి ప్రాణాలను బలి తీసుకుంటున్న ఘటనలు కనిపిస్తున్నాయి.

బైక్ ప్రమాదాలే అధికం

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ఉండేవి ద్విచక్ర వాహనాలే. గతేడాది ఒక్క తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పోలీసు రికార్డుల ప్రకారం మొత్తం ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాల ఘటనలు 276 ఉండగా.. కార్లు 175, లారీలు 114, ఆటోలు 56, ఆర్టీసీ బస్సులు 24, ప్రైవేటు బస్సులు 17 ఉన్నాయి. జాతీయ రహదారులపై 288, ఇతర రోడ్లపై 243 ప్రమాదాలు జరిగాయి. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల నడుమ 90 శాతం ప్రమా దాలు నమోదయ్యాయి. గడిచిన రెండు నెలల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 35 ఏళ్ల లోపు యువకులు 50 మందికి పైగానే మృత్యువాత పడ్డారు. ఇప్పుడు వస్తున్న బైక్‌ల సామర్థ్యానికి, మన రోడ్లకు పొంతన కుదరడం లేదు. ఏకంగా 610 సీసీ సామర్థ్యంతోనూ వస్తున్నాయి. అంటే సెకన్ల వ్యవధిలో గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఇలాంటి బైక్‌లతో మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదం జరిగిన క్షణాల్లో మృత్యువాత పడు తున్నారు. తల్లిదండ్రులు స్టేటస్ పేరుతో అలాంటివే కొనిస్తున్నారు.. హెల్మెట్లు పెట్టుకోవడం లేదు. ఇద్దరికి మించి ప్రయాణిస్తున్నారు. వాహనంపై గర్ల్‌ఫ్రెండ్ ఉంటే మరీ రెచ్చిపోతున్నారు. ప్రమాదంలో ఇద్దరూ చనిపోయిన ఘటనలు ఉన్నాయి.

ఒకరి నిర్లక్ష్యం..మరొకరు బలి!

రోడ్డు ప్రమాదాల్లో విద్యార్థులు, యువకుల ప్రాణాలు బలైపోతున్న ఘటనల్లో ఎదుటి వాహనాల వేగం, నిర్లక్ష్యమూ శాపంగా మారుతోంది. కాలేజీకి వెళుతున్న విద్యార్థుల బైక్‌లను కార్లు, లారీలు, బస్సులు ఢీకొట్టి వెళ్లిపోతున్న ఉదంతాలూ అధికంగానే ఉన్నాయి. జాతీయ రహదారులపైనా, రాజానగరం- సామర్లకోట ఏడీబీ రోడ్డులోనూ జరిగిన ప్రమాదాల్లో పలువురు విద్యార్థులు మరణించారు.



ధవళేశ్వరం ప్రమాదంలో మృతులు

హెల్మెట్ మరవొద్దు మిత్రమా!

ముమ్మిడివరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ మరచిపోవొద్దు మిత్రమా అంటున్నారు.. ఈ స్నేహితులు.. ఎందుకో తెలుసా.. మీరే చదవండి.. ముమ్మిడివరం మండలం క్రివానిరేవు పంచాయతీ పరిధి బూరుగపేటకు చెందిన మట్టా ఆకాష్‌రెడ్డి ముమ్మిడివరానికి చెందిన దొమ్మేటి జయఅబినవ్ గత నెల 28వ తేదీన ఐ.పోలవరం మండలం పాత ఇంజరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. తమ స్నేహితుడు ఆకాశ్‌రెడ్డి హెల్మెట్ లేకపోవడం వల్లే తమకు దూరమయ్యాడని.. హెల్మెట్ ఉంటే బతికి ఉండేవాడని.. అందుకే ప్రతి ఒక్కరూ హెల్మెట్లు పెట్టుకోవాలని చెబుతున్నారు. చెప్పడమే కాదండోయ్.. సోమవారం ముమ్మిడివరంలో 20 మంది కలిసి రూ.25 వేల విలువగల వంద హెల్మెట్లను ముమ్మిడివరం స్టేట్‌బ్యాంకు వద్ద వాహనచోదకులకు ఉచితంగా అందజేశారు.



ఒక్క జనవరిలోనే పోయిన ప్రాణాలు

జనవరి 2 : తూర్పుగోదావరి జిల్లా మోరంపూడికి చెందిన లింగం నవీన్(21), సంతోష్ (20) అన్నదమ్ముల బిడ్డలు. వీరు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరంలో తన స్నేహితుడిని బుధవారం అర్ధరాత్రి ఇంటివద్ద దింపి తిరిగి ఇంటికి వస్తుండగా గండేపల్లి మండలం మురారి గ్రామ శివారున బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ మృతిచెందారు.

జనవరి 3 : అనపర్తి మండలం పులగుర్త వద్ద మండపేట-రామచంద్రపురం కెనాల్ రోడ్డు లో గురువారం అర్ధరాత్రి దాటాక కంటైనర్‌ను బైక్ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్(22) మృతిచెందాడు.



మురారి ప్రమాదంలో మృతులు

జనవరి 3 : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని గైట్ కళాశాల సమీపంలో హైవేపై లారీని ఓవర్ టేక్ చేయబోయి బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో లారీకి హ్యాండిల్ తగిలి బైక్ జారిపడగా రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన మంగం భరత్‌చంద్ర(20) లారీ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు.

జనవరి 4 : కాకినాడ బీచ్‌రోడ్డులో ఓ కళాశాల బస్సు ఢీకొని వలసపాకలకు చెందిన నిమ్మ మణికంఠ(22) మృతిచెందాడు.

జనవరి 5 : రంగంపేట మండలం వడిశలేరులో ఎదురుగా వస్తున్న వ్యాన్ బైక్‌ను బలంగా ఢీకొట్టిన ఘటనలో కాకినాడ జిల్లా గైగోలుపాడుకు చెందిన ఆరవ మణికంఠ (23),తోకాడ చరణ్(22) మృతి చెందారు.

జనవరి 11 : కాకినాడ ఘాటీ సెంటర్ చేపల మార్కెట్ వద్దకు ద్విచక్రవాహనాన్ని లారీ బలంగా ఢీకొట్టిన ఘటనలో కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరానికి చెందిన దేగల రేణుక (18) మృతిచెందింది.

జనవరి 19 : ప్రత్తిపాడు మండలం ధర్మవరం పెట్రోల్ బంకు సమీపంలో బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ఏలేశ్వరం మండలం పేరవరం గ్రామానికి చెందిన రాజమాణి శివ(22) అక్కడికక్కడే మృతి చెందాడు.

జనవరి 20 : రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సెంటర్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో రాజమహేంద్రవరానికి చెందిన యువకుడు నక్క సాయికృష్ణ (23), అతడి మావయ్య కూడా మృతి చెందారు.

జనవరి 20 : కిర్లంపూడికి చెందిన ముక్తా నాగవీరభద్ర దుర్గ (20), పిఠాపురానికి చెందిన దాసరి నిమ్మి చంద్ర (21) సంక్రాంతి పండగకు వచ్చి బైక్‌పై హైదరాబాద్ తిరిగి వెళ్తున్నారు. కృష్ణా జిల్లా గురజాడ సమీపంలో హైవేపై ఫ్లైఓవర్ డివైడర్‌ను వీరి బైక్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందారు.

జనవరి 26 : ముమ్మిడివరం బైపాస్ రోడ్డు వై.జంక్షన్‌లో ఎదురెదురుగా రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ఘటనలో నలుగురు యువకులు గాయపడగా అయినవిల్లి మండలం యలకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్(18), మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురానికి చెందిన గెద్దాడ మణికంఠ(20) మృతిచెందారు.



గత నెల 28న ఐ.పోలవరం వద్ద మృతిచెందిన ఆకాశ్‌రెడ్డి, జయఅభినవ్

రంజాన్ వేళలు — ఇఫ్తార్ (మంగళ) సా.6.20; సహరి (బుధ) ఉ.4.53

అసెంబ్లీలో గళమెత్తారు

ఆడుదాం.. ఆంధ్రా అవినీతి లెక్క తేల్చండి!

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఆడుదాం ఆంధ్ర అంటూ నిర్వ హించిన కార్యక్రమంలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో సీఎం జగన్ ఆడుదాం ఆంధ్ర అంటూ యువత జీవితాలతో బాగా ఆడుకున్నారన్నారు. ఎన్నికల ముందు ఈ కార్యక్రమం నిర్వహించి రూ120 కోట్లు ప్రజాధనం కొల్లగొట్టారన్నారు. 120 మందిని బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించారని అసలు వారెవరు ఎక్కడుంటారు వారిపై వైసీపీ నేతలకు ఎందుకంతా ప్రేమ.. ఎందుకంత పారితోషికం ఇచ్చారో అనేది కూడా తేల్చాలని డిమాండ్ చేసారు.ఆడుదాం ఆంధ్ర పేరుతో ప్రజాధనం కొల్లగొట్టిన వారెవ్వరని వదలకూడదని కోరారు.

బీసీ గురుకుల పాఠశాలల సమస్యలు తీర్చాలి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సర్గీయ నందమూరి తారక రామారావు ఎస్సీ, బీసీలకు గురుకుల పాఠశాలలను ప్రారంభించారు. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కొవ్వూరు నియోజకవర్గంలో అద్దె భవనంలో బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారు.సరైన సౌకర్యాల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం నా బీసీలు అని గొప్పలు చెప్పుకున్నారు తప్ప బీసీ గురుకుల పాఠశాలకు కనీసం స్థలాన్ని కూడా కేటాయించలేక పోయారని విమర్శించారు. కొవ్వూరులో అద్దె భవనంలో అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాలకు స్థలాన్ని కేటయించి,పక్కా భవనాల నిర్మాణం చేపట్టాలని కోరారు.

డీఎస్సీ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ పరీక్షలకు సిద్ధపడుతున్న అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా త్వరలో ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. టెట్ (టీచర్ ఎలిజబిలిటీ టెస్ట్)పరీక్షలో అర్హత సాధించిన జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ కేటగిరీలకు చెందిన అభ్యర్థులకు మాత్రమే ఈ అవకాశం లభించనుంది. ఈ ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు అభ్యర్థులు రాజమహేంద్రవరం బీసీ స్టడీ సర్కిల్‌లో తమ దరఖాస్తులు వెంటనే అందజేయాలని జిల్లా బీసీ సంక్షేమాధికారిణి బి.శశాంక తెలిపారు. టెట్‌లో ఉత్తీర్ణులైనవారు వారి మార్కుల ఆధారంగా ఈ శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు పత్రం బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం నుంచి పొందాలన్నారు. వివరాలకు సెల్‌ఫోన్ 93939 34825, 9705326221 నెంబర్లలోసంప్రదించాలని సూచించారు.

పరిశ్రమల్లో తనిఖీలు చేయండి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నిర్వహణలో భద్రత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఇండస్ట్రీస్ సేఫ్టీ కమిటీ 16వ డీఐఈపీసీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రోత్ హబ్ కింద జిల్లాలో ఏప్రిల్ నెలలో కేంద్ర బృందం సభ్యులు పర్యటిస్తారన్నారు. పరిశ్రమలకు సంబంధించి గణాంకాలు కాకుండా పరిశ్రమలకు వచ్చిన దరఖాస్తులు అనుమతుల జారీలో ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో పరిశీలించి కమిటీ ముందు ఉంచాలన్నారు. అందుకు సంబంధించిన అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలన్నారు. జిల్లాలో అవకాశం ఉన్న రంగాల్లో ఆర్గానిక్ జీడి పరిశ్రమ, కాటన్ క్లాత్స్ చేనేత వస్త్రాలు,గిరిజన ఉత్పత్తులు, అలంకార మొక్కలు, పూల ఉత్పత్తులు ఎగుమతి చేసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల్లో నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి తనిఖీలు నిర్వహించాలన్నారు.జిల్లాలో ఏడు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీలు ప్రతి పరిశ్రమ ప్రమాణాలపై తనిఖీ చేయాలన్నారు.

గ్రీన్ హబ్‌గా తూర్పుగోదావరి

కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ బృందం విశాఖ, విజయనగరం, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల్లో పరిశ్రమల తయారీ రంగం, సేవారంగం కింద అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు జిల్లా పర్యటనకు రానున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఐదు రంగాల్లో గ్రోత్ హబ్‌కు అవకాశాలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తుందన్నారు. నర్సరీ అనుబంధ పరిశ్రమ, టైల్స్ పరిశ్రమ,ఆర్గానిక్ జీడిపప్పు,హెర్బల్ ఉత్పత్తులు తదితర రంగాల్లో అవకాశాలపై నీతి ఆయోగ్ బృందం పరిశీలిస్తుందన్నారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్మిట్ రూమ్‌లు మూత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు మద్యం దుకాణాల్లో తెరిచిన పర్మిట్ రూమ్‌లను మూసేశారు. బార్లు మూత.. జిల్లాలోని ఎక్సయిజ్ శాఖ ఏం చేస్తోందనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర స్థాయిలో స్పందన వచ్చింది. ఎక్సయిజ్ కమిషనర్ స్పెషల్ స్క్వాడ్‌ని జిల్లాకు పంపించారని తెలుస్తోంది. దీంతో సోమవారం జిల్లాలోని ప్రైవేటు మద్యం షాపుల వద్ద మద్యం సేవించడాన్ని ఆపేశారు. బహిరంగంగా మద్యం సేవించడంపై ఇప్పటి వరకూ పోలీసులే కేసులు నమోదు చేయడం జరిగింది. ఎక్సైజ్ అధికారులు కూడా కేసులు నమోదు చేయాలని కమిషనర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో వాళ్లు కూడా తనిఖీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు షాపుల వద్ద మద్యం సేవించడాన్ని నిలుపుదల చేశారు.

పీజీఆర్‌ఎస్ అర్జీలపై దృష్టి పెట్టండి

- 285 అర్జీలు పరిష్కరించాలి
- పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హేతుబద్ధంగా పీజీఆర్‌ఎస్ అర్జీల పరిష్కారం ఉండాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జేసీ ఎస్ చిన్నరాముడుతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఎన్నికల నియమావళి పూర్తయినందున వివిధ స్థాయిల్లో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. స్వయంగా కలిసిన వారి వివరాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల ప్రజావేదిక ,ఆన్‌లైన్‌లలో ఉన్నతాధికారుల ద్వారా వచ్చిన 285 అర్జీలు పరిష్కరించాల్సి ఉందన్నారు. పోలీస్ శాఖ 61, విద్యుత్ శాఖ 31, రెవెన్యూ శాఖ 65, పంచాయితీ రాజ్ 28, వ్యవసాయ శాఖ 6, ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం అయ్యే అర్జీలు జిల్లా కేంద్రానికి రావడం, ఒకే ఫిర్యాదు పలు సార్లు రావడం గుర్తించామన్నారు. భూములు, సర్వే, విభజన మ్యుటేషన్ ,వితంతు ,వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్ల కోసం ,రేషన్ కార్డులు తదితర అంశాలపై అర్జీలు వస్తున్నాయని తెలిపారు.పీజీఆర్‌ఎస్ మధ్యలో ప్రత్యేక అవసరాల వృద్ధులకు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు వీల్ చైర్స్,10 వినికిడి యంత్ర పరికరాలను కలెక్టర్ ప్రశాంతి ,జేసి చిన్నరాముడు అందించారు. అనంతరం అర్జీలు స్వీకరించారు. రాజమహేంద్రవరంలో ఈట్ స్ట్రీట్ తొలగించాలని దళిత గిరిజన ప్రజాసంఘాల కన్వీనర్ మర్రి బాబ్జి , కోకన్వీనర్లు కాశి నవీన్ కుమార్, సుబ్బారావు, తాళ్ళూరి రాజేంద్రప్రసాద్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.దీనిపై నివేదిక ఇవ్వాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో టి.సీతారామమూర్తి , డీఎస్పీ భవ్యకిషోర్, సీపీవో ఎల్.అప్పల కొండా, డీఎల్‌డీవో వీణాదేవి అధికారులు పాల్గొన్నారు.



వకుళమాత అన్నదాన భవన పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

మాస్టర్ ప్లాన్ ప్రకారం వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధి

భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తాం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం రాష్ట్రంలో ప్రసిద్ధ క్షేత్రంగా విరాజిల్లుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నాము' అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి ఆలయంలో వివిధ పనులకు సోమవారం ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించి క్షేత్రంలోని పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తుల సమస్యల పరిష్కారంపై వివిధ శాఖల అధికారులు, గ్రామ స్తులతో చర్చించారు. 'భక్తుల రద్దీ రోజురోజుకూ పెరిగిపోతోంది. వసతి, దర్శన, సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ప్రతి భక్తుడికీ సాధ్యమైనంత త్వరగా దర్శనం అందించే చర్యలు చేపట్టాలి. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా కాపాడుకోవాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాం' అని చెప్పారు. రూ.3.80కోట్లతో వకుళమాత అన్నప్రసాద భవన పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. గోశాల నిర్మాణం, తాత్కాలిక అన్నదాన షెడ్డు వద్ద ఫ్లోరింగ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్ల పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించి సూచనలు చేశారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కోనేరు నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నామని, డార్మెటరీలు, క్యూలైన్ల పనులు శరవేగంగా చేస్తున్నామన్నారు. కాటేజీల నిర్మాణానికి దాతల సహకారం కోరుతున్నామని, పనులకు త్వరలోనే శ్రీకారం చుడతామన్నారు. దశల వారీగా అభివృద్ధి పనులు చేపట్టి భక్తుల ఇబ్బందులను పరిష్కరిస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, సీఐ సీహెచ్ విద్యాసాగర్, తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, ఎస్ఐ ఎస్.రాము, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, ముళ్లపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు



వేసవి నేస్తం

వచ్చేసిందోచ్



అంబాజీపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎరుపు రంగుతో నోరూరించే పుచ్చకాయ అంటే అందరికీ ఇష్టమే. మండుటెండలో ముక్క తింటే ఆ హాయి చెప్పలేనిది. ఎండలు ముదిరి శరీరంలోని ఖనిజ లవణాలు బయటకుపోతున్న తరుణంలో ఈ పుచ్చకాయలను రుచిచూస్తే ఆ మజానే వేరు. ఈ తీయని ఫలాలు ఇప్పుడు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. దాహార్తి తగ్గించేందుకు ఇది బాగా పనిచేస్తుంది. రక్తపోటు ఉన్న వారు పుచ్చకాయ తింటే ఎంతో మేలు జరుగుతుందని వైద్యులు చెప్తున్నారు. కాగా సీజను ఆరంభంలోనే హోల్‌సేల్ ధరలు హడలెత్తిస్తున్నాయి. రిటైల్‌గా మరింత ఎక్కువగా అమ్ముతున్నారు.

మార్కెట్‌లోకి పుచ్చకాయులు
సీజను ప్రారంభంలోనే అధిక ధరలు
రాష్ట్రంలో పంట లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి



100 గ్రాముల పుచ్చకాయ గుజ్జులో ఉండే పోషకాలు...

నీరు: 95.2 గ్రాములు
ప్రొటీన్: 0.3గ్రాములు
కొవ్వు పదార్థాలు: .0.2 గ్రాములు
పీచు పదార్థాలు: 0.4 గ్రాములు
కెరోటిన్: 169 మైక్రో గ్రాములు
సి విటమిన్: 26 మిల్లీ గ్రాములు
కాల్షియం: 32 మిల్లీ గ్రాములు
ఫాస్పరస్: 14 మిల్లీ గ్రాములు
ఇనుము: 1.4 మిల్లీ గ్రాములు
సోడియం: 104.6 మిల్లీ గ్రాములు
పొటాషియం: 341 మిల్లీ గ్రాములు
శక్తి: 17 కిలో కేలరీలు



పుచ్చకాయలో విటమిన్-బి, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా లభిస్తాయి. 92 శాతం ఆల్కలైన్, నీళ్లతో పాటు పీచు పదార్థం ఉండడంతో దీనిని తినడం వల్ల శరీరానికి నూతన శక్తి వస్తుంది. మలబద్ధకం నివారణకు ఇది మంచి చిట్కా అని వైద్యులు చెప్తున్నారు. ఇందులో ఉండే బీటాకెరోటిన్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ నివారణకు దోహదపడుతుంది. కిడ్నీలో రాళ్లు ఉన్న వారికి కూడా ఉపయోగం. ఆస్మా, మధుమేహం, ఆర్థ్రైటిస్ సమస్యల నుంచి చక్కని ఉపశమనం. రక్తప్రసరణ పెరుగుతుంది. గుండె కండరంలోని కణాలను కాపాడడంలో పుచ్చకాయలోని లైకోపీన్ అనే పదార్థం బాగా ఉపయోగపడుతుంది. ముఖవర్చసు పెంచి సౌందర్యానికి కూడా ఉపకరిస్తుంది. జ్వరంతో బాధపడుతున్న వారు పుచ్చకాయ రసంలో తేనె కలిపి సేవిస్తే నీరసం తగ్గి శక్తి వస్తుంది. పుచ్చకాయలో ఉన్నన్ని నీళ్లు మరే పండులో కానీ, కాయలో కానీ ఉండవు. గ్లాసు పుచ్చకాయ రసంలో స్పూన్ తేనె కలిపి రోజూ తీసుకుంటే గుండెజబ్బులు, మూత్రపిండాల వ్యాధులు తగ్గిపోతాయని వైద్యులు చెప్తున్నారు. లోపల ఎర్రటి గుజ్జుతో చూడగానే నోరూరించే పుచ్చకాయ గుజ్జులో గ్లుటాథియాన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్‌ఫెక్షన్లు, జబ్బులు రాకుండా కాపాడుతుంది.



ఒకప్పుడు పట్టణాలు, నగరాల్లో పుచ్చకాయల విక్రయాలు జరిగేవి. నేడు గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటి విక్రయాలు పెరిగాయి. పుచ్చకాయను కోసి ప్లాస్టిక్ గ్లాసుల్లో ఆకర్షణీయంగా పెడుతుండడంతో కొనుగోలుదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. పుచ్చకాయ జ్యూస్ ఎక్కువగా తాగుతున్నారు. గిరాకీ దృష్ట్యా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నారు.

30 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాను



పుచ్చకాయల వ్యాపారాన్ని గత ముప్పై ఏళ్లగా చేస్తున్నాను. ఇతర ప్రాంతాల నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి సైకిల్ వ్యాపారులు, చిరు వ్యాపారులకు విక్రయించేవాడిని. ప్రస్తుతం ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు మన రాష్ట్రంలో పుచ్చకాయ పంటను సాగు చేయట్లేదు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది.

- దంగేటి నారాయణరావు,
పుచ్చకాయల వ్యాపారి, బండారులంక,

పుచ్చకాయలతో ఆరోగ్యం



వేసవిలో పుచ్చకాయలను తినడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారు. దీంట్లో చాలా ఔషధ గుణాలు ఉన్నాయి. నీరసం కలిగిన వ్యక్తులు పుచ్చకాయలను తింటే కొంత ఉపశమనం పొందవచ్చు. దీనిని తినడం వల్ల నీటి శాతం పెరుగుతుంది. దాహం తగ్గుతుంది.

డాక్టర్ కేఎస్ శ్రీనివాసరావు,
వైద్యాధికారి, అంబాజీపేట

నమో నారసింహాయ

- వైభవంగా బ్రహ్మోత్సవాలు
- గోవిందనామంతో పులకించిన కోరుకొండ
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



కోరుకొండలో లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం, స్వామి వారు

కోరుకొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కొండపైన, దిగువున స్వామి వారు ప్రత్యేక ఆభరణాలు, అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5గంటల నుంచే భక్తులు స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. కొండ ఎక్కలేని భక్తులకు స్వామి వారి పాదాల వద్ద పానకం పోసి, కొబ్బరి కాయలు కొట్టారు. మరికొందరు కొండపైకి వెళ్లి స్వయంభూ నరసింహస్వామిని దర్శించుకున్నారు. దిగువ దేవస్థానం ధ్వజస్తంభం వద్ద భక్తులు ఆవునెయ్యి, ఒత్తితో పొన్నచెట్టు దీపాలు వెలిగించారు. పెద్దపెద్ద మట్టి మూకుడులో మంచి నూనె వేసి దీపాలు వెలిగించారు. అంతకుముందు దేవుని కోనేటి వద్ద పుణ్యస్నానాలు చేసి దీపాలు వెలిగించారు. మహిళలు కొండ పాదవునా 615 మెట్లకు పసుపు రాసి బొట్టు పెట్టుకుంటూ పైకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఉదయం, సాయంత్రం స్థానిక మిరియాల వెంకటరెడ్డి పంతులు ధర్మసత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు. 5 రోజుల పాటు భక్తులందరికీ అన్నదానం చేస్తామని సత్రం ఈవో తెలిపారు.

వైభవంగా నరసన్న రథోత్సవం

నరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం జరిగిన రథోత్సవాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, వ్యవస్థాపక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, ఇతర అధికారులు, నాయకులు ప్రారంభించారు. అంతకుముందు స్వామి వారిని, అమ్మవారిని పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరించి మధ్యాహ్నం 1.56 గంటలకు రథోత్సవం ప్రారంభించారు. పండితులు రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోవిందా గోవిందా అంటూ భక్తజనం రథాన్ని లాగారు. రథానికి ముందు పండితుల వేద గోష, భజనలు, గరగ నృత్యాలు, కోలాట నృత్యాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాలు ఆకట్టుకున్నాయి. 250 మంది స్వామి మాలధారులు జెండాలతో రథం ముందు నడిచారు. రథం సాయంత్రం 6గంటలకు స్వామి దిగువ దేవస్థానానికి చేరింది. ఈ సందర్భంగా అనేక మంది భక్తులు స్వచ్ఛందంగా మజ్జిగ, మంచినీరు, ప్రసాదాలు పంపిణీ చేశారు.



శ్రీ లక్ష్మీనరసింహ స్వామి





స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల, పల్లకీ మోస్తున్న దృశ్యం

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్ఐ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశవరావు, కటకం చలం, జనసేన నాయకులు బదిరెడ్డి దొర, సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం..

లక్ష్మీనరసింహస్వామి, శ్రీభూ సమేత అనంత పద్మనాభ స్వామి వార్ల కల్యాణోత్సవం సోమవారం రాత్రి 11గంటలకు వైభవంగా జరిగింది. ఒకే రోజు ఒకే శుభముహూర్తంలో ఇటు నరసింహస్వామిది, అనంత పద్మనాభుడి కల్యాణం ఒకే వేదికపై నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం. రథోత్సవం అనంతరం సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లను రథం పైనుంచి ఎదుర్కోలుతో మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయానికి తోడ్కొని వచ్చారు. అక్కడ మంగళస్నానాలు జరిపించారు. కల్యాణోత్సవాల్లో పెద్దింటి రంగాప్రసాద్, పెద్దింటి చంటిబాబు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. వీరితో పాటు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, మరో 300 మంది యజమాన దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీటీడీ, అంతర్వేది నరసింహస్వామి దేవస్థానం, పలువురు భక్తులు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కల్యాణోత్సవాలు తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కోరుకొండలో నేటి కార్యక్రమాలు

నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం కొండ పైన, దిగువున స్వామివారి సర్వదర్శనం ఉంటుంది. ఉదయం 9గంటలకు సేవాకాలం, రాత్రి 8గంటలకు గరుడ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది. రాత్రి 7నుంచి 9గంటల వరకు స్వామి వారి కళావేదికపై కూచిపూడి నృత్యప్రదర్శన, శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ఉదయం, సాయంత్రం పండిత సభలు జరుగనున్నాయి.



కోనేటిలో స్నానమాచరిస్తున్న భక్తులు



రథోత్సవంలో శక్తివేషధారణలు




రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల, బీవీఆర్ చౌదరి



వేంకటేశ్వరస్వామి వేషధారణ

తలుపులమ్మకు కాసుల హారం

తుని రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం లోవ స్థానంలో తలుపులమ్మ అమ్మవారికి కాకినాడకు చెందిన కోకా వెంకట కోటేశ్వర ఫణి-మైథిలి దంపతులు 102గ్రాములతో బంగారు కాసుల హారం చేయించారు. సోమవారం హారాన్ని ఈవో పి.విశ్వనాథరాజుకు అందజేశారు. దాతలకు వేద పండితులు ఆశీర్వచనమిచ్చి తీర్థ ప్రసాదాలందజేశారు.



తొడుగు మేలే

- మామిడి కాయలకు తొడుగులతో మంచి దిగుబడులు
- 50 శాతం రాయితీపై కవర్ల పంపిణీ
- డీబీటీ పథకంలో రైతులకు వర్తింపు
- ఉద్యాన శాఖ అధికారిణి దివ్యశ్రీ







మామిడి చెట్టున ఉన్న కాయలకు తొడిగిన కవర్లు

రాజానగరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో మామిడి కాయలకు తొడుగులు అమర్చడంతో మేలైన పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారి దివ్యశ్రీ రైతులకు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పండ్ల తోటల రైతులు, వ్యాపారులకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై కవర్లు/తొడుగులను మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్(డీబీటీ) పథకంలో భాగంగా అందజేస్తాందన్నారు. కవరు ఒకటి రూ.2 వంతున కొనుగోలు చేస్తే దీనిలో రూ.1 రాయితీ రైతు ఖాతాలో జమవుతుందన్నారు. హెక్టారుకు 10 వేలు కవర్లపై రాయితీ వర్తిస్తుందన్నారు.

సమర్పించాల్సిన పత్రాలు...

ఆసక్తి కలిగిన రైతులు కవర్లు కొనుగోలు చేసిన బిల్లు, ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాసు పుస్తకాలు జిరాక్స్ పత్రాలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోను సంబంధిత రైతు సేవా కేంద్రం (ఆర్‌ఎస్‌కే)లో అందజేయాల్సి ఉంటుందన్నారు.

చీడపీడల నియంత్రణ..

పండ్ల తోటల రైతులు మామిడి కాయలకు కవర్లు వినియోగించడం వల్ల మసి, మంగు, మచ్చలు, తేనె మంచు పురుగు, కాయపుచ్చు, టెంక పురుగు, మకరం, ఈగలు మొదలైన వాటిని నియంత్రించడంతో పాటు నాణ్యమైన మామిడి పండ్ల దిగుబడులు పొందవచ్చని దివ్యశ్రీ అంటున్నారు.

ఎప్పుడు, ఎలా వాడాలి..

మామిడి పిందె దశలో అనగా నిమ్మకాయ, కోడి గుడ్డు పరిమాణం దశకు చేరుకున్న తర్వాత కవర్లు వాడాలి. మంచి పిందెలను సంచిలో పెట్టి మూడు సెంటీమీటర్ల పైన తొడిమకు సంచికి ఉండే తీగను గాలి చొరబడకుండా కట్టాలన్నారు. 50 రోజుల తర్వాత కాయలు కోత దశకు చేరుకుంటాయన్నారు.

ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి..

మామిడి తొడుగులు/కవర్లు చెక్క గుజ్జుతో తయారైన పేపరును మామిడి కాయకు తొడగడం వల్ల మంచి లక్షణాలు చేకూరి, చెడు లక్షణాలు తొలగిపోతాయి. అంతే కాకుండా క్రిమికీటకాలు పండ్లను నాశనం చేయకుండా కాపాడుతుంది. అధిక సూర్యరశ్మి, వడగండ్ల వాన నుంచి కాపాడుతుంది. పరిమాణాన్ని, సహజ రంగును వృద్ధి చేస్తుంది. అలాగే తక్కువ కాలంలోనే పెరుగుదల సామర్థ్యాన్ని పెంచి, అధిక దిగుబడులనిస్తుంది. అంతేకాకుండా మామిడి పండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పండ్ల తోటల రైతులు, వ్యాపారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దివ్యశ్రీ కోరారు.

హోంగార్డుపై ఎస్‌ఐ ప్రతాపం

- దొంగతనం అంటగట్టాలని ప్రయత్నం
- నేరం ఒప్పుకోవాలని తీవ్ర ఒత్తిడి
- తీరా అతడు కాదని తేలడంతో వదిలివేసిన వైనం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఉదంతం?



ఎస్‌ఐ యూనిఫాంలో దోపిడీకి పాల్పడిన అసలు నిందితుడు

రాజమహేంద్రవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లారీని ఎస్‌ఐ వేషంలో బెదిరించి డబ్బులు వసూలు చేశాడనే అనుమానంతో ఒక హోంగార్డును విచారణ పేరుతో ఒక ఎస్‌ఐ చితకబాదిన వైనం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈనెల 2న తెల్లవారుజామున రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరు బ్రిడ్జిపై చిత్తూరు వెళుతున్న ఓ లారీని పోలీసు అంటూ ఓ వ్యక్తి ఎస్‌ఐ దుస్తుల్లో అటకాయించాడు. డ్రైవరును బెదిరించి బైక్‌పై ఎక్కించుకుని పేపరుమిల్లు సమీపంలోని ఓ ఏటీఎంకి తీసుకెళ్లాడు. డ్రైవరుతో రూ.10వేలు డ్రా చేయించి తీసుకుని అతడిని లారీ వద్ద దింపేశాడు. ఈ విషయం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ వరకూ వెళ్లడంతో త్రీటౌన్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు వేగం చేశారు. సీసీ ఫుటేజీ లను పరిశీలించారు. ఓ హోం గార్డు మాదిరిగా ఆ ఫుటేజీలోని వ్యక్తి కనబడడంతో ఆ హోంగార్డును ఇంటికెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడికి తీసుకువెళ్తున్నారో ఇంట్లో కుటుంబ సభ్యులకు కూడా చెప్పలేదు. ఆ హోంగార్డు సుమారు 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్నాడు. అతడిని పోలీసుల వార్‌రూమ్‌కు అంటే నిందితులను చితక్కొట్టే ప్రదేశానికి తీసుకెళ్లారు. ఓ ఎస్‌ఐ వచ్చి సదరు హోంగార్డును నానా బూతులు తిట్టారు. భౌతిక దాడికీ దిగాడు. నేరం ఒప్పుకోవాలని తీవ్ర ఒత్తిడి చేశాడు. ఈలోపు ఆరుగురు పోలీసులు జీపులో ఆ హోంగార్డు ఇంటికెళ్లి ఏ ఉత్తర్వులూ చూపకుండా సోదాలు చేశారు. హోంగార్డు తల్లి, చిన్న పిల్లాడిని బెంబేలెత్తించారు. అయితే అసలు దొంగ దొరికాడని సమాచారం రావడంతో రాత్రి 9 గంటల సమయంలో ఆ హోంగార్డుకు సర్ది చెప్పి పంపేశారు. ఆ హోంగార్డుతో ఒట్టు వేయించుకున్నారు. చిరుద్యోగి కావడంతో అధికారులను ప్రశ్నించలేక రోదిస్తూ ఇంటికెళ్లిపోయాడు. అనంతరం హోంగార్డు కార్యాలయానికి అతడిని అటాచ్ చేశారు.

జైల్లో పరిచయం.. ఒంటరి మహిళలే లక్ష్యం!

- వాహన తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరు దొంగలు
- 78 గ్రాముల బంగారం, మోటార్ సైకిల్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్డీపీవో పాటిల్ దేవరాజ్

కాకినాడ రూరల్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): వాహన తనిఖీల్లో ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం కాకినాడ జిల్లా ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కాకినాడ ఎస్డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ ఈ వివరాలను వెల్లడించారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న చైన్ స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడే వారిని పట్టుకునే చర్యల్లో భాగంగా సోమవారం ఉదయం కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించారు. ఇంద్రపాలెం మునలమ్మతల్లి గుడికి సమీపంలో ఎస్‌ఐ ఎం. వీరబాబు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా బైక్‌పై వస్తున్న కాకినాడ రూరల్ మండలం తూరంగికి చెందిన గంపల సతీష్ (25), కిర్లంపూడి మండలం బూరగుపూడికి చెందిన పట్నం వరప్రసాద్(26)ను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు పాత నేరస్థులేనని, ఒంటరి మహిళలే వారి లక్ష్యమని తెలిసిందని ఎస్డీపీవో చెప్పారు. నిందితులు జైల్లో ఒకరికొకరు పరిచయమై మిత్రులై కలిసి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. వారి నుంచి సుమారు రూ.6,50,000 విలువచేసే 78 గ్రాముల బంగారం, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంద్రపాలెం పీఎస్‌లో 2, కరప పీఎస్‌లో 1, కాకినాడ 1వ పట్టణ పీఎస్ పరిధిలోని 1కేసులో మొత్తం 78 గ్రాముల చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో కాకినాడ సీసీఎస్ సీఐ కృష్ణ, ఏఎస్‌ఐలు గోవిందు, పుల్లయ్య పాల్గొనగా దొంగలను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్డీపీవో అభినందించారు.

చంద్రబాబు నిర్ణయాన్ని శిరసావహిస్తా

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, భవిష్యత్తు రథసారధి నారా లోకేశ్ నిర్ణయాలు, ఆదేశాలను శిరసావహిస్తానని, వాటిని తాను, తన కుటుంబం, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ కుటుంబం ఎల్లప్పుడు పాటిస్తామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు తొలివిడతలోనే వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో 5 ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి ఆయనకు ఇస్తారని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భావించారు. అయితే ఆదివారం రాత్రి ప్రకటించిన జాబితాలో వర్మకు ఎమ్మెల్సీ రాకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తమ నాయకుడిని ఈ సారి అన్యాయమే జరిగిందని ఆవేదన చెందారు. దీంతో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పట్టణంలోని టీడీపీ కార్యాలయానికి సోమవారం భారీగా తరలివచ్చారు. వారితో వర్మ మాట్లాడుతూ ఉద్వేగానికి గురయ్యారు. చంద్రబాబుతో మన ప్రయాణం 23 ఏళ్లు, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో ప్రజాసమస్యలపై పోరాటం సాగించామని, అధికారంలోని ఉన్నా, ప్రతిపక్షంలో అయినా వారికి, పార్టీకి అండగా ఉన్నామని తెలిపారు. ప్రజా సేవ చేసే అవకాశమే తనకు పెద్ద పదవి అని అన్నారు. పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఎల్లప్పుడు చంద్రబాబు, లోకేశ్‌లకు అండగా ఉంటుందని ప్రకటించారు. వారి అడుగుజాడల్లోనే తామంతా నడుస్తామని తెలిపారు. పార్టీలో మనకు ఎంతో భవిష్యత్తు ఉందని, అందరూ కుటుంబంలా కలిసికట్టుగా ఉంటూ పార్టీకి అండగా ఉందామని వర్మ ప్రకటించారు.

ఆలోచింపజేసిన ఇది అతని సంతకం



ఇది అతని సంతకం నాటకంలోని ఓ దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి జీవితంలో ఒక లక్ష్యం, నిర్దిష్టమయిన ప్రణాళిక, బలమైన నిర్ణయం ఉంటుంది. దానిని ఆచరణలో పెట్టి సాధించుకోగలిన వారి జీవితం పరిపూర్ణమవుతుంది అని ఇది అతని సంతకం నాటకం ద్వారా చాటి చెప్పారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటకాల పోటీల్లో మూడోరోజు సోమవారం గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఇది అతని సంతకం నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. గోపి సత్యప్రకాష్ (స్నిగ్ధ) రచించగా ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు.


రేపు రైల్వే జీఎం రాక

రాజమహేంద్రవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ బుధవారం పర్యటించనున్నారు. ఆయన భద్రతా పరమైన అంశాలపైనే దృష్టి కేంద్రీకరిస్తారని తెలుస్తోంది. ఉదయం 10 గంటలకు కాకినాడలో బయలుదేరి ట్రాక్, పాయింట్లు తదితర అంశాలను పరిశీలించుకుంటూ రాజమహేంద్రవరం గుండా విజయవాడ వెళ్తారు. రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో ఆగినా ట్రాక్, సిగ్నల్స్ సంబంధిత భద్రతా అంశాలనే పరిశీలిస్తారని చెబుతున్నారు. వాస్తవానికి గత నెల 9 నుంచి ఆయన పర్యటన వాయిదా పడుతూ వస్తోంది. ఇక్కడ పనులు పూర్తికాకపోవడంతో ఆలస్యమైంది. గతంలో జీఎం తనిఖీలు ఉంటే క్వార్టర్లతో సహా అన్నిటినీ ముస్తాబు చేయడం రివాజుగా ఉండేది. కానీ ఇప్పుడు నిధుల కొరత వల్ల భద్రతా పనులకే పరిమి తమయ్యారు.

'పది' మూల్యాంకన విధులపై సమావేశం

కాకినాడ రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షాపత్రాల మూల్యాంకనం విధులపై సోమవారం కాకినాడలోని రామకృష్ణ ఆడిటోరియంహాల్లో పాఠశాల విద్య జోన్2 ఆర్జేడీ జి.నాగమణి ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశీలకుల సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. కాకినాడ, పశ్చిమగోదావరి జిల్లాల డీఈవోలు రమేష్, నారాయణ, ఏసీఈలు, సీసీవోలు, ఏసీవోలు పాల్గొన్నారు.

ఓపీకపట్టి..



కాకినాడలోని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి సోమవారం రోగులు పోటెత్తారు. ఉదయం 8 గంటల నుంచే బారులుతీరారు. 'ఓపీ' కోసం క్యూలలో గంటల తరబడి వేచి ఉన్నారు. నిరీక్షించి, నీరసించారు.

ఫొటో గ్రాఫర్ -కాకినాడ

కొడుకుని చూసేందుకు వెళ్తూ.. తండ్రి మృత్యువాత



అప్పారావు మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

రాజుపాలెం రహదారిపై మృతదేహంతో బంధువుల ఆందోళన

కిర్లంపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి లారీని బైక్ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిల్లంగి గ్రామానికి చెందిన కొప్పన అప్పారావు(29) ఆదివారం రాత్రి చిల్లంగి నుంచి వీరవరం అత్తవారింటికి వెళ్తుండగా రాజుపాలెం గ్రామం వద్ద ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో అప్పారావు ప్రమాదవశాత్తు ఆ లారీని వెనుక నుంచి బైక్‌తో ఢీకొన్నాడు. దీంతో అప్పారావు తలకు బలయమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బంధువులు సోమవారం ఉదయం రాజుపాలెం నుంచి సామర్లకోట వెళ్లే రహదారిపై మృతదేహంతో నిరసన తెలిపారు. దీంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే కిర్లంపూడి పోలీసులు, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ సంఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. బంధువులతో మాట్లాడి న్యాయం చేస్తామని నచ్చజెప్పారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

4 నెలల క్రితమే కొడుకు పుట్టడంతో..

అయితే అప్పారావు తాపీపని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. అతడికి భార్య, కూతురు, ఉన్నారు. కాగా 4 నెలల క్రితమే కొడుకు పుట్టాడు. కుమారుడిని చూసేందుకు ఆదివారం రాత్రి వెళ్తుండగా అప్పారావును మృత్యువు లారీ రూపంలో కబలించేసింది. ఈ దుర్ఘటనతో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. దీంతో అటు చిల్లంగి, ఇటు వీరవరం గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. పిల్లలిద్దరూ అనాధలైపోయారని అప్పారావు భార్య, బంధువులు రోధనలు మిన్నంటాయి. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని మృతుడు అప్పారావు బంధువులు కోరుతున్నారు.

పరీక్ష రాసేందుకు వెళ్తూ... ఇంటర్ విద్యార్థి దుర్మరణం



సంఘటనా స్థలంలో వంశీ మృతదేహం



ఫైల్‌ఫొటో

సామర్లకోట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య అభ్యసించాలని ఎన్నో కలలు కన్న విద్యార్థిపైకి మృత్యువు ట్రాక్టర్ రూపంలో వచ్చింది. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించిన సంఘటన కాకినాడ జిల్లా సామర్లకోట మండలం గొంచాల గ్రామంలో సోమవారం జరిగింది. సామర్లకోట మండలం రావువారిచంద్రంపాలెనికి చెందిన ప్రగాఢ వంశీ (19) ఇంటి నుంచి కాకినాడలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసేందుకు మిత్రులతో మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మార్గమధ్యన రోడ్డుపై ఇసుక గుట్ట కారణంగా మోటార్‌సైకిల్ రోడ్డుపైకి స్కిడ్ అయ్యి వెనుక కూర్చున్న ప్రగాఢ వంశీ (19) రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ వంశీ తలపై నుంచి వెళ్లిపోవడంతో మరణించాడు. కేవలం పది నిమిషాల ముందే పరీక్ష రాసేందుకు ఇంటి నుంచి వెళ్లిన తమ కుమారుడు ప్రమాదంలో మృతిచెందాడన్న సమాచారంతో వంశీ తండ్రి రాజు, తల్లి రోధించారు. సంఘటనా స్థలికి సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ సిబ్బందితో చేరుకుని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు నిర్వహించారు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుతాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామం వెళ్తుండగా..

లారీ ఢీకొని మహిళ మృతి



మృతిచెందిన విజయకుమారి

రావులపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఉబలంక వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆత్రేయపురం మండలం కట్టుంగకు చెందిన వందే విజయకుమారి (40) భర్త రమేష్‌బాబుతో కలిసి మోటార్‌సైకిల్‌పై పని నిమిత్తం రావులపాలెం వచ్చారు. తిరిగి స్వగ్రా మం వెళ్తుండగా మార్గమధ్యలో ఉబలంక సమీపంలోకి వచ్చేసరికి టిప్పర్ లారీ బలంగా ఢీకొంది. విజయకుమారి లారీ కింద పడి తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే మృతిచెందగా భర్త రమేష్ బాబు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



సత్యనారాయణ (ఫైల్)

పిఠాపురం రూరల్, మార్చి 10(ఆంధ్ర జ్యోతి): పంటపొలాల్లో విద్యుత్‌షాక్‌కు గురయి రైతు మరణించాడు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన రైతు చిన్నారి సత్యనారాయణ(65) సోమవారం పశువుల మేత కోసం గడ్డి కోసేందుకు పొలంలోకి వెళ్లాడు. గడ్డి కోసుకుని తిరిగి వస్తుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మరణించాడు. పంటపొలాల్లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయని పలుమార్లు ఎలక్ట్రికల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని, వీటి వల్లే సత్యనారాయణ మరణించాడని అతని కుటుంబసభ్యులు, రైతులు చెప్పారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

రూ.3 లక్షల ఆస్తి నష్టం

అమలాపురం రూరల్, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు ఎఫ్‌సీఐ గోడౌన్ సమీపంలోని పీచు ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్టు అమలాపురం అగ్నిమాపక అధికారి కె.మురళీకొండబాబు తెలిపారు. సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంభవించింది. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది సకాలంలో మంటలు అదుపుచేశారు. దొమ్మేటి విష్ణువీర వసంతరాయులు, భైరిశెట్టి శ్రీనివాస్‌కు చెందిన ఫ్యాక్టరీలోని పీచు రూ.3లక్షలమేర నష్టం వాటిల్లినట్టు చెప్పారు.

రాజవొమ్మంగిలో కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

రాజవొమ్మంగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి నయారా పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిలో ఆగిఉన్న కారులో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. మండలంలోని లాగరాయి గ్రామానికి చెందిన గంటిమెల్ల సన్యాసిరావుకు చెందిన కారులో ఇద్దరు వ్యక్తులు లాగరాయి నుంచి రాజవొమ్మంగి సాయికిరణ్ కాన్వెంట్‌కు పిల్లలను తీసుకెళ్లడానికి వచ్చి రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. ఈ తరుణంలో కారు ఇంజన్ నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు, బంక్ సిబ్బంది అదుపు చేశారు. రేడియేటర్‌లో వాటర్ లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని మెకానిక్లు తెలిపారు. కారు రన్నింగ్‌లో మంటలు వ్యాపిస్తే పెనుప్రమాదం జరిగి ఉండేదని భావించారు.

ఆన్‌లైన్ షేర్ల పేరిట రూ.60 లక్షలు స్వాహా

రాజమహేంద్రవరం, మార్చి 10(ఆంధ్ర జ్యోతి): ఆన్‌లైన్ షేర్లలో అధిక లాభాలు వస్తాయని ఓ విశ్రాంత ఉద్యోగి లక్షల్లో సొమ్ము కోల్పోయారు. ప్రకాశం నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వెంకటేశ్వరనగర్‌కు చెందిన నున్న వెంకటేశ్వరరావు పేపర్ మిల్లులో జీఎం స్థాయిలో ఉద్యోగం చేస్తూ రెండేళ్ల క్రితం విరమణ పొందారు. విరమణ డబ్బులను షేర్ మార్కెట్‌లో పెట్టడం ద్వారా ఇంకా ఆదాయం సంపాదించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్‌లో షేర్ మార్కెట్ గురించి వెతికారు. ఈ క్రమంలో ఓ కంపెనీ ఎక్కువ మొత్తంలో లాభాలు చూపడంతో ఆ కంపెనీ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రక్రియ పూర్తి చేశారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి దఫదఫాలుగా పెట్టుబడి పెట్టగా డబ్బులు బాగానే వచ్చాయి. దీంతో ఈ జనవరి నుంచి రూ.60లక్షలు పెట్టుబడి పెట్టారు. యాప్‌లో రూ.1కోటికిపైగా లాభాలు చూపిస్తున్నాయి. అయితే ఆ డబ్బులు తన ఖాతాలో జమ కావడం లేదు. దీంతో ఆ యాప్ గురించి ఆయన ఇంటర్నెట్‌లో వెతకగా కనబడలేదు. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

జనసేన ఆవిర్భావ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు

- వేదికపై యువత, రైతు, మహిళ ప్రతినిధులకు మాట్లాడే అవకాశం
- మంత్రి నాదెండ్ల మనోహర్



కాకినాడలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో మార్చి 14న జరగనున్న పార్టీ ఆవిర్భావ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభ దాదాపు 5గంటలపాటు సాగుతుందన్నారు. మన భాష, యాస, సంస్కృతిని ప్రతిబింబించేలా కల్చరల్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేశామన్నారు. సభకు పెద్దఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్నా దృష్ట్యా వారికి ఎలాంటి ఇక్కట్లు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా తిరుగు ప్రయాణంలో భోజనానికి ఇబ్బంది కలగకుండా ముఖ్యమైన 4 రహదారుల్లో భోజన వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభలో యువతకు మాట్లాడే అవకాశం కల్పించాలని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదేశించారన్నారు. రైతు, మహిళ ప్రతినిధులు మాట్లాడతారన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై పవన్ మాట్లాడతారని పేర్కొన్నారు.

పారిశుధ్యం కోసం ప్రత్యేక కమిటీ

సభ పూర్తయిన అనంతరం పరిసరాలను శుభ్రం చేయడానికి ప్రత్యేక కమిటీ నియమించాలని పవన్ స్పష్టం చేశారన్నారు. ఈ మేరకు కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ఆధ్వర్యంలో 25 మంది స్థానిక నాయకులతో కమిటీని నియమించామని, ఈ కమిటీ సభ ముగిసిన అనంతరం సభా ప్రాంగణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జెండాలు, ఫ్లెక్సీలు, ఇతర పార్టీల జెండాలు కిందపడినా వాటిని జాగ్రత్తగా తొలగిస్తారని తెలిపారు. సభకు తరలివచ్చే కార్యకర్తల కోసం మజ్జిగ, మంచినీరు, ఓఆర్ఎస్‌ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నామన్నారు. వీటితోపాటు పుచ్చకాయ ముక్కలు ఉచితంగా అందించేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు. ఇందుకు కాకినాడ, చుట్టుపక్కల ప్రాంతాల తోపుడు బండ్లవారితో మాట్లాడుతున్నాం.


75 సీసీ కెమెరాలతో నిఘా

ఉపముఖ్యమంత్రి పవన్ సభకు హాజరవుతున్నందున ఆయన భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోలీస్ డిపార్టుమెంట్ తీసుకుంటుందన్నారు. ఇందుకోసం 75 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

పిఠాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభకు తరలివచ్చే లక్షలాది మంది కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారులో ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో ఈనెల14న జరగనున్న 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, సభ ఏర్పాట్లును ఆయన జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి సోమవారం సాయంత్రం పరిశీలించారు.

తుని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా రూపాదేవి



బాధ్యతలు స్వీకరిస్తున్న రూపాదేవి

తుని రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మున్సిపాలిటీలో వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలో తీవ్ర గందరగోళానికి తెరపడింది. 17 మంది వైసీపీ కౌన్సిలర్లు వరుసగా టీడీపీలోకి చేరిపోవడంతో వైసీపీ సంఖ్యా బలం సన్నగిల్లింది. దీంతో చేసేదేమీ లేక ఆ పార్టీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణి రాజీనామా సమర్పించారు. దీంతో టీడీపీలోకి చేరిన 17 మంది కౌన్సిలర్లతో తొలి కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది. ఇటీవల టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సమక్షంలో టీడీపీలోకి చేరిన 28వ వార్డు కౌన్సిలర్ కుచ్చర్ల పాటి రూపాదేవి ఇన్‌చార్జి వైస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో వైసీపీ తుని మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి రాజీనామాను కౌన్సిల్ ఆమోదించింది. బాధ్యతలు చేపట్టిన రూపాదేవికి టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, సుర్లలోవరాజు, యినుగంటి సత్యనారాయణ, నాయకులు, కౌన్సిల్ సభ్యులు శుభాకాంక్షలు తెలపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళకు మంత్రి సాయం



మహిళను మంత్రి వాహనం వద్దకు తీసుకెళ్తున్న దృశ్యం

ఆలమూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరు వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళకు సాయం చేసి రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుబాష్ మానవత్వాన్ని చాటుకున్నారు. రాయవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన సూరిశెట్టి రేవతి, రామకృష్ణ దంపతులు బైక్‌పై వెళ్తుండగా ఆలమూరు మండలం గుమ్మిలేరు వద్ద ప్రమాదం జరిగి రేవతి తీవ్రంగా గాయపడింది. అదే సమయంలో అసెంబ్లీ సమావేశాలకు రామచంద్రపురం నుంచి అమరావతి వెళ్తున్న మంత్రి వాసంశెట్టి సుబాష్ ఆగారు. మహిళను తక్షణం తన వాహనంలో మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యసాయం అందించారు. అక్కడ ఉన్న వైద్యులతో సంప్రదించి మెరుగైన వైద్యసాయం అందించాలని ఆదేశించారు. అనంతరం ఆయన అమరావతికి తరలివెళ్లారు.

సోమాలమ్మ ఉగాది ఉత్సవాలకు ఏర్పాట్లు



రాట ముహూర్తంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): స్థానిక కొత్తపేటలోని సోమాలమ్మ ఉగాది జాతర మహోత్సవాలకు నాందిగా సోమవారం రాట ముహూర్తం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమాలమ్మను దర్శించుకుంటే సకల శుభాలు, సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకమని ఆయన పేర్కొన్నారు. ఆలయాభివృద్ధికి, ఉత్సవాల నిర్వహణకు సహకారం అందిస్తామన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కడియాల వీరభద్రరావు మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ఉగాది సందర్భంగా 28, 29, 30 తేదీల్లో ప్రత్యేక పూజలు, ఏప్రిల్ 2న అమ్మవారి ఊరేగింపు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దొండపాటి సత్యంబాబు, కూటమి నాయకులు మజ్జి రాంబాబు, రెడ్డి రాజు, బుడ్డిగ రాధా, వై.శ్రీను, జమ్మి సత్యనారాయణ, మాలే విజయలక్ష్మి, కంటిపూడి శ్రీను, చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తితోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పశుబీమా పథకానికి ప్రచారలోపం

యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగు

దివాన్‌చెరువు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంచి ఆశయంతో అమలు చేస్తున్న పశుబీమా పథకానికి తగిన ప్రచారం లభించడంలేదని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు (నాగు) ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రచారం లేకపోవడంతో ఎక్కువ మంది ఈ పథకాన్ని వినియోగించుకోలేక పోతున్నారన్నారు. పశుపోషకులకు ప్రయోజనం కల్పించే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం పశు బీమా పథకాన్ని అమలుచేస్తోందన్నారు. రైతుల వద్ద ఎంతో విలువైన ఆవులు, గేదెలు, మేకలతోపాటు గొర్రెలు ఉంటాయని, వాటి సంరక్షణకు రైతులు ఎంతో శ్రమిస్తారన్నారు. అయితే అనుకోని పరిస్థితుల్లో ఆ పశువులు మరణిస్తే వారికి బీమా ద్వారా పరిహారం పొందేందుకు వీలు ఉంటుందన్నారు. ఇప్పటికైనా ఈ పథకానికి బాగా ప్రచారం చేయించి ఎక్కువ మంది రైతులు ప్రయోజనం పొందేటట్టు చూడాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

విశిష్ట అద్వైత పండిత సభలు



సభలో ఉపన్యసిస్తున్న వేదాంత పండితులు

కోరుకొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక రంగరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో 93వ విశిష్ట అద్వైత పండిత సభలను సోమవారం ఉభయ వేదాంత పండితులు పరాసర లక్ష్మీనరసింహ భట్టర్ ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో సేవాకాలం నిర్వహించారు. శ్రీ రామానుజ ధ్వజారోహణ చేశారు. అనంతరం లక్ష్మీనరసింహభట్టర్ స్వామి ప్రారంభ ఉపన్యాసం చేస్తూ శృతి, స్మృతి, ఇతిహాస, పురాణ భగవద్గీత, బ్రహ్మసూత్రాలు, అళ్వారుల ప్రబంధాల్లోని అంశాలను వివరించారు. అనంతరం మరో ఉభయ వేదాంత పండితులు మార్గపూరి లక్ష్మీనరసింహస్వామి ఉపన్యసించారు. ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, సాయంత్రం 4నుంచి 7.30గంటల వరకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఉభయ వేదాంత పండితులు ఉపన్యసిస్తారని లక్ష్మీనరసింహభట్టర్ తెలిపారు.

రాయచోటి ఘటనలో ఎస్ఐని సస్పెండ్ చేయాలి

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ.. కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 9(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి ఘటనలో స్థానిక ఎస్ఐ తప్పుడు కేసులు బనాయించడం తగదని బాధిత హిందువులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని విశ్వహిందు పరిషత్ సభ్యులు డిమాండ్ చేశారు. తప్పుడు కేసులు పెట్టిన ఎస్ఐని సస్పెండ్ చేయాలన్నారు. ఈ ఘటనపై సీఎం, డిప్యూటీ సీఎం లను ఉద్దేశించిన వినతిపత్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్‌కు విపతిపత్రం అందజేశారు. ముందుగా కోటిపల్లి బస్టాండ్ నుంచి రాధామనోహర్ స్వామి, విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్షుడు సత్తి గోవింద రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 300 మంది బైక్ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటిలో ఈ నెల 4న జరిగిన వీరభద్రస్వామి ఆలయ పార్వేటి ఉత్సవం సందర్భంగా భక్తులు ఊరేగింపు చేస్తుండగా హిందువులపై ముస్లింలు దాడిచేశారని, దాడిని అదుపు చేయడంలో పోలీసులు విఫలం కావడమేకాకుండా హిందువులపైనే లాఠీచార్జి చేసి, అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తంచేశారు. బాధ్యులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గనిరాజు, గీత, వెంకట్ ప్రదీప్‌వర్మ, గంగాధరం పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలు ఇప్పించాలి

» ఏపీ రైతు కూలీ సంఘం
» ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కలెక్టరేట్ ధర్నాలతో దద్దరిల్లింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసాక కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ జరగడంతో వివిధ సమస్యలతో అక్కడకు వచ్చిన ప్రజా సంఘాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు చేశాయి. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, నాగులపల్లి అచ్చారావు, జగ్గంపూడి రాజు, కాసారపు శేషు, గురం వీరబాబులు ఏలేరు నిర్వాసిత ప్రజలు ధర్నా చేశారు. గోకవరం మండలం కామరుపేట, భూపతిపాలెం పరిధిల్లో 30 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న సర్వేనెంబరు 32, 36,39/1, 40/1, 43/2, 52,41,42,44,45,53/1, 60, 71, 5, 29, 48, 7, 62/3లలో భూములకు పట్టా ఇప్పించాలని కోరుతు ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అలాగే 20 ఏళ్లుగా గోకవరం మండలం శివరామపట్నంలో పేదలు సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏపిఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ సర్వే నెంబరు 4/1, 34/1, 35/2ఎ, 36/2 సీలింగ్ భూములు ఎత్తుపల్లాలు చదును చేసుకుని 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, డి సురేష్, ఎల్లే సత్తిబాబు, జాను, జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, కొండా దుర్గారావు, కె.రామలింగేశ్వరరావు, పీడీఎస్‌యూ(వి) నాయకులు కడితి సతీష్, శ్రీకాంత్, పారిశుధ్య కార్మికుల సమాఖ్య కన్వీనర్ బొచ్చ యేసు, తోలేటి లక్ష్మణ, కర్నూల్ జీఎస్, జోకా పెద్ద, తోలేటి అర్జున్ బాత పేదలు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులు కాలానుగుణంగా రాణించాలి

గోకవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానుగుణంగా ఎప్పటికపుడు ఫార్మాసిస్టులు తన వృత్తిలో రాణించాలనే సదుద్దేశంతో కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ కొత్త కొండబాబు అన్నారు. కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ రిటైల్ ఫార్మాసిస్టులు ఐదేళ్లకోసారి తమ సర్టిఫికెట్లను రెన్యువల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ నాగమణి, ప్రిన్సిపాల్ త్రినాథ్‌రావు, కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కడియంలో వైభవంగా జనార్దనస్వామి కల్యాణం

కడియం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కడియంలో శ్రీజనార్దనస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారు ఝామున స్వామి వారికి పండితులు పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, సర్వదర్శనం, స్వామి వారిని పెండ్లికుమారుని చేయడం, గ్రామోత్సవం, సాయంత్రం రథోత్సవం, అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన, గరుడ, ప్రధాన, హోమాలు, బలిహరణ, ధ్వజప్రతిష్ఠ, ధ్వజారోహణ నిర్వహించారు. వంశపారంపర్య ప్రధాన అర్చకులు వేదాంతం చక్రపాణి ఆధ్వర్యంలో వేదపండితులు స్వామి వారి కల్యాణం నిర్వహించారు. రథోత్సవంలో స్వామి వారు పల్లకీపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కేవీవీరమణతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థిని ప్రతిభ

గోకవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో మండలంలోని గుమ్మళ్ళదొడ్డి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ చాటింది. ఈ పాఠశాల నుంచి పదిమంది విద్యార్థులు పాల్గొనగా ఏడో తరగతి చదువుతున్న ఈ.సుగుణ జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి కైవసం చేసుకొంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకాంతం, ఉపాధ్యాయులు, తదితరులు విద్యార్థిని సుగుణను అభినందించారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

పారిశుధ్య నిర్వహణపై జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి



ఈలకొలనులో మహిళలతో మాట్లాడుతున్న డీపీవో శాంతామణి

రంగంపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా సోమవారం డీఎల్‌పీవో ఎం.నాగమణితో కలిసి ఆమె మండలంలోని ఎస్టీ రాజాపురం, ఈలకొలను, జి.దొంతమూరు గ్రామాల్లో పర్యటించారు. ప్రజల వద్దకు వెళ్లి పారిశుధ్య సిబ్బంది ఇంటింటా చెత్త సేకరణ సేవలను పరిశీలించారు. గ్రామాల్లో నేరుగా మహిళలతో మాట్లాడి తడిచెత్త, పొడిచెత్త పట్ల ఉన్న అవగాహనను అంచనా వేశారు. సేకరించిన తడి చెత్తను వెంటనే సంపద తయారీ కేంద్రానికి తీసుకెళ్లి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనిచేస్తుందా? రోజు విడిచి రోజు ఇళ్ల వద్ద చెత్త సేకరణ జరుగుతుందా? తడి, పొడి చెత్తపై అవగాహన ఉందా? అని ప్రశ్నించారు. చెత్త సేకరణను శాస్త్రీయ పద్ధతిలో చేయడం, సంపద సృష్టి కేంద్రంలో వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం రావడమే కాకుండా ప్రజల ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. కార్యదర్శులు పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కార్యదర్శుల పనితీరును విస్తరణాధికారి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, మండలంలోని ప్రతి సంపద సృష్టి కేంద్రాల్లో వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని ఆదేశించారు. పని తీరు మార్చుకోని కార్యదర్శులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. డీపీవో వెంట ఈవో పీఆర్డీ పి.వెంకటరత్నం ఉన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం

» పలు గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు
» ఆలయాలను సందర్శించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



రంగంపేటలో వెంకన్న స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రంగంపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రంగంపేటలో శ్రీఅలివేలు మంగా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంగళస్నానం, గణపతి పూజ, రక్షాబంధనం, అంకురారోపణ, ధ్వజారోహణ, హోమ పూజలు జరిగాయి. కల్యాణోత్సవాన్ని వ్యాపారవేత్తలు మేడిశెట్టి రమణ, శివ, వీరబాబు, ఆనంద్, కుక్కల వెంకటరమణ, దంపతులతో పండితులు చేయించారు. ఆలయార్చకుడు దేవరబొట్ల శిరిడి సాయిశర్మ, కమిటీ సభ్యులు పోతుల రామ్‌కుమార్, చావ సూర్యనారాయణ, శ్రీను మాష్టారు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోదండ రామాలయ వార్షికోత్సవం

స్థానిక గ్రామ సచివాలయం వద్ద శ్రీకోదండ రామాలయ ఆరో వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆరుమిల్లి సురేంద్రతో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గారపాటి శ్రీనివాసరావు,భజన కమిటీ సభ్యులతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలసుబ్రహ్మణ్యేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ

రంగంపేట ఇలవేల్పు శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి, శ్రీసంతాన బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త ఉండవిల్లి జానకిరామ సుబ్బారావు దంపతులతో విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు, నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, ఉండవిల్లి గిరిబాబు, యూవీవీ మాణిక్యం, గారపాటి శ్రీనివాస్, పోతుల చిన్నికాపు, పద్మారావు పాల్గొన్నారు.



వీరవరంలో లక్ష్మిగణపతి ఆలయం వద్ద భక్తులు

వీరవరంలో గణపతి విగ్రహ ప్రతిష్ఠ

కడియం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవరంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మూడు రోజులుగా వేదపండితులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం శ్రీలక్ష్మిగణపతి నందీశ్వర, చౌడేశ్వరి అమ్మవారి విగ్రహాలు ప్రతిష్ఠించారు. గోదర్శనం అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాత సోమాలమ్మకు లక్ష పుష్పార్చన

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎల్‌పురంలో శ్రీ పాతసోమాలమ్మ ఆలయంలో సోమవారం ముదునూరి సత్యనారాయణవర్మ దంపతులు లక్ష పుష్పార్చన నిర్వహించారు. అమ్మ వారిని గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సహస్ర లింగార్చన, కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగాయి. ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్, కమిటీ సభ్యులు పూడి ప్రకాష్, వై.ఫణికుమార్, రమేష్, సిద్ధు, విశ్వనాథ్, కేలం రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సోమాలమ్మకు పూజలు చేస్తున్న గన్ని కృష్ణ

యువగళం హామీలను నెరవేర్చాలి

» ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా
» ఆర్డీవో కృష్ణనాయక్‌కు వినతి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని, వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.త్రిమూర్తులు, జిల్లా ఉపాధ్యక్షుడు చింతలపూడి సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కృష్ణనాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నాయకులు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నియోజకవర్గాల్లో పాదయాత్ర చేసిన సమయంలో లోకేశ్ హామీలన్నీ నెరవేర్చాలని కోరుతున్నామని అన్నారు. కార్యక్రమంలో డీఎస్ జ్యోతి, ఆర్.పార్వతి, కె.కోమలిరాణి, సీహెచ్ పోసికుమారి, లావణ్య, దేవి పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలివ్వాలి

20 ఏళ్లుగా తమ సాగులో ఉన్న సీలింగ్ భూములకు పట్టాలు ఇవ్వాలని గోకవరం మండలం శివరామపట్నం గ్రామానికి చెందిన వ్యక్తులు ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ భూమిలేని పేదలు అక్కడి సీలింగ్ భూములను 20 ఏళ్లగా సాగు చేసుకుంటున్నారని, ఆ భూములపై సాగుదారులకు పట్టాలు మంజూరు చేయాలని, పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి అందే రాయితీలను పొందలేకపోతున్నారన్నారు. ఈ భూములపై భూస్వాములు చేస్తున్న కుట్రలను మానుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, కొండా దుర్గారావు, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలను వేగంగా పరిష్కరించాలి

» ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్
» 22 అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నెలకొన్న సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా 22 మంది కమిషనర్‌ను కలిసి తమ సమస్యలను ఏకరవుపెట్టి అర్జీలను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను పరిశీలన చేసి వాటికి నాణ్యతతో కూడిన పరిష్కారం చూపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలో మెరుగైన పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నగరానికి చెందిన ఎం.భాగ్యలక్ష్మి తనకు మునిసిపల్ పరిధిలో జీవనోపాధి నిమిత్తం షాపును ఇప్పించవలసిందిగా కోరారు. ఇందిరా సత్యనగర్‌కు చెందిన ఎన్.వాసవి తన ఇల్లు కట్టుకోవడాని న్యాయపరమైన సమస్యలు ఉన్నందున వాటి క్లియరెన్స్‌కు సహకరించాలని విన్నవించారు. అలాగే పారిశుధ్యం, వీధి దీపాలు, పన్నులు తదితర సమస్యలను కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వి.వినూత్న, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

డీపీవోలో గ్రీవెన్స్‌కు 29 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్(పీజీఆర్ఎస్)కు 29 మంది ఫిర్యాదుదారులు అర్జీలు సమర్పించారు. అడిషనల్ ఎస్పీ(పరిపాలన) ఎన్‌బీఎం మురళీకృష్ణ అర్జీదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచే ఆయా పోలీస్ స్టేషన్ల బాధ్యులకు ఫోన్ చేసి చట్ట పరిధిలో సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ మురళీకృష్ణ

బీజేపీలో చేరికలు

బీజేపీలోకి కుటుంబాలు చేరికగోకవరం, మార్చి10(ఆంధ్రజ్యోతి): దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే భారతీయ జనతా పార్టీతోనే సాధ్యపడుతుందని ఆ పార్టీ నాయకుడు, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెం గ్రామంలో సుమారు 200 కుటుంబాలు ఆదివారం రాత్రి శ్రీనివాసరావు సమక్షంలో బీజేపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రంపయర్రంపాలెం గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన కార్యకర్తలతో కంబాల శ్రీనివాసరావు

నేటి నుంచి బైబిల్ మిషన్ మహాసభలు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 నుంచి 13వరకు వీఎల్ పురంలోని మార్గాని ఎస్టేట్స్‌లో బైబిల్ మిషన్ మహాసభలు నిర్వహిస్తున్నామని రెవరెండ్ ఎన్‌జె షారోన్, రెవరెండ్ సుదన్ షారోన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సభలకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది విశ్వాసులు హాజరౌతారని, వారికి అన్ని వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

సావిత్రీబాయి పూలే వర్ధంతి

బిక్కవోలు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్త్రీల విద్యాభివృద్ధికి, హక్కుల కోసం కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమ కారిణి సావిత్రీబాయిపూలే అని ఊలపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొవ్వూరి అమ్మిరెడ్డి తెలిపారు. పూలే వర్ధంతిని సోమవారం పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సంఘ సంస్కర్తగా, మొదటి మహిళా ఉపాధ్యాయినిగా, రచయితగా ఆమె సమాజానికి ఎనలేని సేవలు అందించారన్నారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

రాజమహేంద్రవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డుకు చెందిన ఓ బాలిక(17) ఈ నెల 8న ఇంటర్మీడియట్ పరీక్ష వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. అలాగే ఏవీ అప్పారావు రోడ్‌కు చెందిన ఓ బాలిక(17) ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాజీలాల్ తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు కిట్లు పంపిణీ

బిక్కవోలు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు సోమవారం పూర్ణా ఫౌండేషన్ సభ్యులు దేవాదుల అనిల్‌కుమార్, సత్తి శివరామారెడ్డి పరీక్షలు రాయడానికి ఉపయోగాపడే కిట్లను పంపిణీ చేశారు. తమ బాల్య మిత్రుడు ఇమంది పూర్ణకుమార్ జ్ఞాపకార్థం కొన్నేళ్లుగా ఈసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారన్నారు. పూర్ణా ఫౌండేషన్ చేస్తున్న సేవలను హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ కొనియాడారు.

రోటరీ క్లబ్ రివర్ సిటీ ఆర్థిక సహాయం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారి కుమారుడికి చదువుకు ఫీజు కట్టడానికి రోటరీ క్లబ్ రివర్ సిటీ అధ్యక్షుడు నాలం నరసింహారావు ముందుకు వచ్చారు. పిల్లవాడు చదువుతున్న నాగదేవా హోలీ క్రాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు వెళ్లి ఫీజు చెల్లించారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, జనసేన నాయకురాలు అలివేలు, హెల్పింగ్ హ్యాండ్స్ అడ్మిన్ అనూప్ కుమార్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని జాతీయ సేవా విభాగం యూనిట్-5 ఆధ్వర్యంలో రూరల్ మండలం కాతేరు గ్రామంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు నేత్రవైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారని ప్రోగ్రాం అధికారిణి భవాని తెలిపారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వైద్యుడు డాక్టర్ బి.శ్రీనివాసరావు, వారి సిబ్బంది ఈ పరీక్షలు చేశారని తెలిపారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కబ్జా చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

రంగంపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈలకొలను గ్రామంలో దళిత పేదలకు ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, తమ స్థలాలను తమకు కేటాయించాలని ఏపీ రైతుకూలీ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం కలెక్టర్ ఆఫీసు వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ పి.ప్రశాంతికి వినతిపత్రం ఇచ్చామని సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు తెలిపారు. ఈలకొలనులో ప్రభుత్వం పేదలకు సర్వే నెంబర్ 12లో స్థలాలు కేటాయించారని, 15 మందికి ఇచ్చిన స్థలాలను కొందరు వ్యక్తులు అధికార పార్టీ అండదండలతో ఆక్రమించుకున్నారన్నారు. సమస్యను పరిష్కరించి తమ స్థలాలు తమకు ఇప్పించాలని కోరారు. పలువురు సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సేవాభావమే స్కౌట్ గైడ్ ధ్యేయం

కడియం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఉన్న స్కౌట్ గైడ్ ధ్యేయం దేశం, సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండడమేనని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 160 మంది స్కౌట్ గైడ్ విద్యార్థులకు కడియం ఉన్నత పాఠశాలలో ఈ నెల 10నుంచి 14వరకు రెసిడెన్సియల్ పెట్రోల్ లీడర్ ట్రైనింగ్ క్యాంపు నిర్వహిస్తున్న సందర్భంగా జాతీయ స్కౌట్ పతాకాలను ఆవిష్కరించారు. సర్వశిక్ష ఏఎంవో గౌరీశంకర్, సీఐ ఎ.వెంకటేశ్వరరావు, మాట్లాడుతూ మిలటరీ, పోలీసు ఆఫీసర్లు కావడానికి స్కౌట్ గైడ్ ఉపయోగ పడుతుందన్నారు. క్యాంపు డైరెక్టర్‌గా హెచ్‌ఎం టి.సత్యనారాయణ వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీగా సోము వీర్రాజు



అనూహ్యంగా ఎమ్మెల్సీ పదవి సోము వీర్రాజును వరించింది.. బీజేపీ నుంచి ఆయనను ఎంపిక చేశారు. ఈ మేరకు అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు విడుదల య్యాయి. దీంతో సోమవారం రాజధానిలో నామినేషన్ దాఖలు చేశారు.గత 2015లో ఒకసారి టీడీపీ బీజేపీ పొత్తు నేపథ్యంలో ఎమ్మెల్సీ పదవి వరించింది. ప్రస్తుతం కూటమితో పొత్తు నేపథ్యంలో ఈసారి ఎమ్మెల్సీ పదవి వరించింది.. దీంతో జిల్లాలో బీజేపీ బలం పెరిగింది. - మెయిన్‌లో

స్వామిని కోరుకొండ!

కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి.. కొండపై ఉన్న స్వామిని కొలిచేందుకు 615 మెట్లు ఎక్కి తండోపతండాలుగా భక్తజనం తరలివెళుతున్నారు.. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం స్వామి రథోత్సవం నిర్వహించారు.. పెద్ద ఎత్తున భక్తజనం గోవిందా..గోవింద అంటూ స్వామి రథాన్ని లాగారు.. రాత్రి ఆలయంలో కల్యాణం జరిపించారు.. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై కొలిచారు.. ఓం నమో నారసింహాయ అంటూ మొక్కారు.. ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ వరకూ నిర్వహిస్తారు. 8



సాగుతున్న రథోత్సవం.. మొక్కుతున్న భక్తజనం



చిన్నపాటి నిర్లక్ష్యం జీవితాలను అతలాకుతలం చేసేస్తోంది.. కుటుంబాలను తీరని దుఃఖంలో ముంచేస్తోంది.. ఒక్క ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే చూస్తే కనురెప్పల మాటున కన్నీటిని అదిమిపెట్టుకుని జీవచ్ఛవాల్లా బతుకుతున్న వారెందరో.. కష్టాలు తీరుస్తాడని.. తమకు అండగా ఉంటాడని.. తమను పున్నామి నరకం నుంచి తప్పిస్తాడని ఎదురుచూస్తుంటే.. చేతికందివచ్చిన కొడుకు లేడు.. ఇక తిరిగి రాడంటే ఎంత కష్టం.. ఆ బాధను ఆపడం ఎవరితరం.. అయితే ప్రస్తుత యువత మాత్రం ఇవేమీ ఆలోచించడం లేదు.. వాయువేగంగా వెళ్లిపోతున్నారు.. 18 నుంచి 30 ఏళ్ల మధ్యే ప్రాణాలను బలిపెడుతున్నారు.. ఈ మూడు నెలల్లోనే సుమారు 75 మంది యువత మృత్యువాతపడింది. ఈ ఆయువేగానికి కారణం ఎవరు.. ముందు తల్లిదండ్రులే. స్టేటస్ పేరుతో ఎక్కువ సీసీ బైక్‌లు కొనిచ్చేస్తున్నారు.. ఉడుకురక్తం.. ఆ బైక్‌పై రయ్ రయ్‌మంటూ వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.. తల్లిదండ్రులూ యువతే కాదు.. మీ పిల్లలకు తెలియజెప్పాలి. అతివేగం ప్రమాదమని హెచ్చరించాలి.



ఇక మాకు దిక్కెవరయ్యా : ప్రత్తిపాడు వద్ద ప్రమాదంలో మృతిచెందిన కుమారుడి వద్ద తల్లి రోదన





వేగం తీసిన ప్రాణాలు

జగ్గంపేట వద్ద ఈ నెల 3న జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి

ఆయువేగం!

స్పీడుగా..పోతున్నారు!

- యువత ప్రాణాలు తీస్తున్న అతివేగం
- 3 నెలల్లో 75 మంది వరకూ మృతి
- అంతా 18 నుంచి 30 ఏళ్ల లోపువారే
- రోజురోజుకు పెరుగుతున్న ప్రమాదాలు
- ఎక్కువ సీసీ బైక్‌లే కారణం
- తల్లిదండ్రులూ తగ్గించాల్సిందే మరి



ధవళేశ్వరం ప్రమాదంలో మృతులు

అమలాపురం/రాజమహేంద్రవరం/పిఠాపురం, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదం జరిగితే జీవితాలు గల్లంతే. ఆ ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే అప్పటిదాకా సాఫీగా సాగిపోతున్న కుటుంబం ఒడిదుడుకులకు లోనవుతుంది. కానీ.. లేకలేక పుట్టిన కొడుకు, అల్లారుముద్దుగా పెంచుకొన్న కొడుకు, చేతికి అందివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం జీవితాంతం దుఃఖాన్ని గుండెల్లో దాచుకుని రోజులు వెళ్లదీయాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అనేక రోడ్డు ప్రమాదాల్లో విద్యార్థులు, యువకులు అత్యధికంగా మృత్యువాతపడ్డారు. వరుసగా జరుగుతున్న ఈ ఘటనలన్నీ ఆందోళన కలిగిస్తుండగా, వీరి కుటుంబాలు గర్భశోకంతో తల్లడిల్లిపోతున్నాయి. ఈ విషాద ఘటనల్లో ఎక్కువశాతం అతివేగం లేదంటే ఏమరుపాటు కారణాలవ్వడం గమనించాల్సిన విషయం. అలాగే అత్యధిక ప్రమాదాల్లో మరణిస్తున్న యువకులు హెల్మెట్ ధరించకపోవడమూ మరో కారణం. మద్యం లేదా గంజాయి మత్తులో కొందరు కుర్రాళ్లు రాత్రిళ్లు మితిమీరిన వేగంతో వెళ్లి ఆగి ఉన్న వాహనాలను ఢీకొనడంతో చనిపోతున్న సైనాలు జరుగుతున్నాయి. బైక్ రేసింగ్ మరో కారణంగా కనబడుతోంది. ఇలా అనేక రకాలుగా యువత రోడ్డు ప్రమాదాల్లో మరణించి ఆయా కుటుంబాలను శోకసంద్రంలో ముంచెత్తుతున్నారు. దీనిపై అధికారుల పూర్తి పర్యవేక్షణ లేకపోవడం, కొన్నిచోట్ల హెచ్చరికలు చేస్తున్నా యువకులు లక్ష్యపెట్టకపోవడం వల్ల కూడా వారి ప్రాణాలను బలి తీసుకుంటున్న ఘటనలు కనిపిస్తున్నాయి.

బైక్ ప్రమాదాలే అధికం

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ఉండేవి ద్విచక్ర వాహనాలే. గతేడాది ఒక్క తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పోలీసు రికార్డుల ప్రకారం మొత్తం ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాల ఘటనలు 276 ఉండగా.. కార్లు 175, లారీలు 114, ఆటోలు 56, ఆర్టీసీ బస్సులు 24, ప్రైవేటు బస్సులు 17 ఉన్నాయి. జాతీయ రహదారులపై 288, ఇతర రోడ్లపై 243 ప్రమాదాలు జరిగాయి. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల నడుమ 90 శాతం ప్రమా దాలు నమోదయ్యాయి. గడిచిన రెండు నెలల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 35 ఏళ్ల లోపు యువకులు 50 మందికి పైగానే మృత్యువాత పడ్డారు. ఇప్పుడు వస్తున్న బైక్‌ల సామర్థ్యానికి, మన రోడ్లకు పొంతన కుదరడం లేదు. ఏకంగా 610 సీసీ సామర్థ్యంతోనూ వస్తున్నాయి. అంటే సెకన్ల వ్యవధిలో గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఇలాంటి బైక్‌లతో మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదం జరిగిన క్షణాల్లో మృత్యువాత పడు తున్నారు. తల్లిదండ్రులు స్టేటస్ పేరుతో అలాంటివే కొనిస్తున్నారు.. హెల్మెట్లు పెట్టుకోవడం లేదు. ఇద్దరికి మించి ప్రయాణిస్తున్నారు. వాహనంపై గర్ల్‌ఫ్రెండ్ ఉంటే మరీ రెచ్చిపోతున్నారు. ప్రమాదంలో ఇద్దరూ చనిపోయిన ఘటనలు ఉన్నాయి.

ఒకరి నిర్లక్ష్యం..మరొకరు బలి!

రోడ్డు ప్రమాదాల్లో విద్యార్థులు, యువకుల ప్రాణాలు బలైపోతున్న ఘటనల్లో ఎదుటి వాహనాల వేగం, నిర్లక్ష్యమూ శాపంగా మారుతోంది. కాలేజీకి వెళుతున్న విద్యార్థుల బైక్‌లను కార్లు, లారీలు, బస్సులు ఢీకొట్టి వెళ్లిపోతున్న ఉదంతాలూ అధికంగానే ఉన్నాయి. జాతీయ రహదారులపైనా, రాజానగరం- సామర్లకోట ఏడీబీ రోడ్డులోనూ జరిగిన ప్రమాదాల్లో పలువురు విద్యార్థులు మరణించారు.

హెల్మెట్ మరవొద్దు మిత్రమా!

ముమ్మిడివరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ మరచిపోవొద్దు మిత్రమా అంటున్నారు.. ఈ స్నేహితులు.. ఎందుకో తెలుసా.. మీరే చదవండి.. ముమ్మిడివరం మండలం క్రరివానిరేవు పంచాయతీ పరిధి బూరుగపేటకు చెందిన మట్టా ఆకాష్‌రెడ్డి ముమ్మిడివరానికి చెందిన దొమ్మేటి జయఅభినవ్ గత నెల 28వ తేదీన ఐ.పోలవరం మండలం పాత ఇంజరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. తమ స్నేహితుడు ఆకాశ్‌రెడ్డి హెల్మెట్ లేకపోవడం వల్లే తమకు దూరమయ్యాడని.. హెల్మెట్ ఉంటే బతికి ఉండేవాడని.. అందుకే ప్రతి ఒక్కరూ హెల్మెట్లు పెట్టుకోవాలని చెబుతున్నారు. చెప్పడమే కాదండోయ్.. సోమవారం ముమ్మిడివరంలో 20 మంది కలిసి రూ.25 వేల విలువగల వంద హెల్మెట్లను ముమ్మిడివరం స్టేట్‌బ్యాంకు వద్ద వాహనచోదకులకు ఉచితంగా అందజేశారు.



ఒక్క జనవరిలోనే పోయిన ప్రాణాలు

జనవరి 2 : తూర్పుగోదావరి జిల్లా మోరంపూడికి చెందిన లింగం నవీన్(21), సంతోష్ (20) అన్నదమ్ముల బిడ్డలు. వీరు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరంలో తన స్నేహితుడిని బుధవారం అర్ధరాత్రి ఇంటివద్ద దింపి తిరిగి ఇంటికి వస్తుండగా గండేపల్లి మండలం మురారి గ్రామ శివారున బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ మృతిచెందారు.

జనవరి 3 : అనపర్తి మండలం పులగుర్త వద్ద మండపేట-రామచంద్రపురం కెనాల్ రోడ్డు లో గురువారం అర్ధరాత్రి దాటాక కంటైనర్‌ను బైక్ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్(22) మృతిచెందాడు.



మురారి ప్రమాదంలో మృతులు

జనవరి 3 : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని గైట్ కళాశాల సమీపంలో హైవేపై లారీని ఓవర్ టేక్ చేయబోయి బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో లారీకి హ్యాండిల్ తగిలి బైక్ జారిపడగా రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన మంగం భరత్‌చంద్ర(20) లారీ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు.

జనవరి 4 : కాకినాడ బీచ్‌రోడ్డులో ఓ కళాశాల బస్సు ఢీకొని వలసపాకలకు చెందిన నిమ్మ మణికంఠ(22) మృతిచెందాడు.

జనవరి 5 : రంగంపేట మండలం వడిశలేరులో ఎదురుగా వస్తున్న వ్యాన్ బైక్‌ను బలంగా ఢీకొట్టిన ఘటనలో కాకినాడ జిల్లా గైగోలుపాడుకు చెందిన ఆరవ మణికంఠ (23),తోకాడ చరణ్(22) మృతి చెందారు.

జనవరి 11 : కాకినాడ ఘాటీ సెంటర్ చేపల మార్కెట్ వద్దకు ద్విచక్రవాహనాన్ని లారీ బలంగా ఢీకొట్టిన ఘటనలో కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరానికి చెందిన డేగల రేణుక (18) మృతిచెందింది.

జనవరి 19 : ప్రత్తిపాడు మండలం ధర్మవరం పెట్రోల్ బంకు సమీపంలో బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ఏలేశ్వరం మండలం పేరవరం గ్రామానికి చెందిన రాజమాణి శివ(22) అక్కడికక్కడే మృతి చెందాడు.

జనవరి 20 : రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సెంటర్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో రాజమహేంద్రవరానికి చెందిన యువకుడు నక్క సాయికృష్ణ (23), అతడి మావయ్య కూడా మృతి చెందారు.

జనవరి 20 : కిర్లంపూడికి చెందిన ముక్కా నాగవీరభద్ర దుర్గ (20), పిఠాపురానికి చెందిన దాసరి నిమ్మి చంద్ర (21) సంక్రాంతి పండగకు వచ్చి బైక్‌పై హైదరాబాద్ తిరిగి వెళ్తున్నారు. కృష్ణా జిల్లా గురజాడ సమీపంలో హైవేపై ఫ్లైఓవర్ డివైడర్‌ను వీరి బైక్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందారు.

జనవరి 26 : ముమ్మిడివరం బైపాస్ రోడ్డు వై.జంక్షన్‌లో ఎదురెదురుగా రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ఘటనలో నలుగురు యువకులు గాయపడగా అయినవిల్లి మండలం యలకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్(18), మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురానికి చెందిన గెద్దాడ మణికంఠ(20) మృతిచెందారు.



గత నెల 28న ఐ.పోలవరం వద్ద మృతిచెందిన ఆకాశ్‌రెడ్డి, జయఅభినవ్

రంజాన్ వేళలు | ఇఫ్తార్ (మంగళ) సా.6.20 | సహరి (బుధ) ఉ.4.53

అసెంబ్లీలో గళమెత్తారు

ఆడుదాం.. ఆంధ్రా అవినీతి లెక్క తేల్చండి!

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఆడుదాం ఆంధ్ర అంటూ నిర్వ హించిన కార్యక్రమంలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో సీఎం జగన్ ఆడుదాం ఆంధ్ర అంటూ యువత జీవితాలతో బాగా ఆడుకున్నారన్నారు. ఎన్నికల ముందు ఈ కార్యక్రమం నిర్వహించి రూ120 కోట్లు ప్రజాధనం కొల్లగొట్టారన్నారు. 120 మందిని బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించారని అస్సలు వారెవరు ఎక్కడుంటారు వారిపై వైసీపీ నేతలకు ఎందుకంతా ప్రేమ.. ఎందుకంత పారితోషికం ఇచ్చారో అనేది కూడా తేల్చాలని డిమాండ్ చేసారు.ఆడుదాం ఆంధ్ర పేరుతో ప్రజాధనం కొల్లగొట్టిన వారెవ్వరని వదలకూడదని కోరారు.

బీసీ గురుకుల పాఠశాలల సమస్యలు తీర్చాలి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని స్వర్గీయ నందమూరి తారక రామారావు ఎస్సీ, బీసీలకు గురుకుల పాఠశాలలను ప్రారంభించారు. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కొవ్వూరు నియోజకవర్గంలో అద్దె భవనంలో బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారు.సరైన సౌకర్యాల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం నా బీసీలు అని గొప్పలు చెప్పుకున్నారు తప్ప బీసీ గురుకుల పాఠశాలకు కనీసం స్థలాన్ని కూడా కేటాయించలేకపోయారని విమర్శించారు. కొవ్వూరులో అద్దె భవనంలో అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాలకు స్థలాన్ని కేటయించి,పక్కా భవనాల నిర్మాణం చేపట్టాలని కోరారు.

డీఎస్సీ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ పరీక్షలకు సిద్ధపడుతున్న అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా త్వరలో ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. టెట్ (టీచర్ ఎలిజబిలిటీ టెస్ట్)పరీక్షలో అర్హత సాధించిన జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ కేటగిరీలకు చెందిన అభ్యర్థులకు మాత్రమే ఈ అవకాశం లభించనుంది. ఈ ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు అభ్యర్థులు రాజమహేంద్రవరం బీసీ స్టడీ సర్కిల్‌లో తమ దరఖాస్తులు వెంటనే అందజేయాలని జిల్లా బీసీ సంక్షేమాధికారిణి బి.శశాంక తెలిపారు. టెట్‌లో ఉత్తీర్ణులైనవారు వారి మార్కుల ఆధారంగా ఈ శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు పత్రం బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం నుంచి పొందాలన్నారు. వివరాలకు సెల్‌ఫోన్ 93939 34825, 9705326221 నెంబర్లలోసంప్రదించాలని సూచించారు.

పరిశ్రమల్లో తనిఖీలు చేయండి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నిర్వహణలో భద్రత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఇండస్ట్రీస్ సేఫ్టీ కమిటీ 16వ డీఐఈపీసీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రోత్ హబ్ కింద జిల్లాలో ఏప్రిల్ నెలలో కేంద్ర బృందం సభ్యులు పర్యటిస్తారన్నారు. పరిశ్రమలకు సంబంధించి గణాంకాలు కాకుండా పరిశ్రమలకు వచ్చిన దరఖాస్తులు అనుమతుల జారీలో ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో పరిశీలించి కమిటీ ముందు ఉంచాలన్నారు. అందుకు సంబంధించిన అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలన్నారు. జిల్లాలో అవకాశం ఉన్న రంగాల్లో ఆర్గానిక్ జీడి పరిశ్రమ, కాటన్ క్లాత్స్ చేనేత వస్త్రాలు,గిరిజన ఉత్పత్తులు, అలంకార మొక్కలు, పూల ఉత్పత్తులు ఎగుమతి చేసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. పరిశ్రమల్లో నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి తనిఖీలు నిర్వహిం చా లన్నారు.జిల్లాలో ఏడు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీలు ప్రతి పరిశ్రమ ప్రమాణాలపై తనికీ చేయాలన్నారు.

గ్రీన్ హబ్‌గా తూర్పుగోదావరి

కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ బృందం విశాఖ, విజయనగరం, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల్లో పరిశ్రమల తయారీ రంగం, సేవారంగం కింద అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు జిల్లా పర్యటనకు రానున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఐదు రంగాల్లో గ్రోత్ హబ్‌కు అవకాశాలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తుందన్నారు. నర్సరీ అనుబంధ పరిశ్రమ, టైల్స్ పరిశ్రమ,ఆర్గానిక్ జీడిపప్పు,హెర్బల్ ఉత్ప త్తులు తదితర రంగాల్లో అవకాశాలపై నీతి ఆయోగ్ బృందం పరిశీలిస్తుందన్నారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్మిట్ రూమ్‌లు మూత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు మద్యం దుకాణాల్లో తెరిచిన పర్మిట్ రూమ్‌లను మూసేశారు. బార్లు మూత.. జిల్లాలోని ఎక్సయిజ్ శాఖ ఏం చేస్తోందనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర స్థాయిలో స్పందన వచ్చింది. ఎక్సయిజ్ కమిషనర్ స్పెషల్ స్క్వాడ్‌ని జిల్లాకు పంపించారని తెలుస్తోంది. దీంతో సోమవారం జిల్లాలోని ప్రైవేటు మద్యం షాపుల వద్ద మద్యం సేవించడాన్ని ఆపేశారు. బహిరంగంగా మద్యం సేవించడంపై ఇప్పటి వరకూ పోలీసులే కేసులు నమోదు చేయడం జరిగింది. ఎక్సైజ్ అధికారులు కూడా కేసులు నమోదు చేయాలని కమిషనర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో వాళ్లు కూడా తనిఖీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు షాపుల వద్ద మద్యం సేవించడాన్ని నిలుపుదల చేశారు.

పీజీఆర్ఎస్ అర్జీలపై దృష్టి పెట్టండి

- 285 అర్జీలు పరిష్కరించాలి
- పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హేతుబద్ధంగా పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం ఉండాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జేసీ ఎస్ చిన్నరాముడుతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఎన్నికల నియమావళి పూర్తయినందున వివిధ స్థాయిల్లో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. స్వయంగా కలిసిన వారి వివరాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల ప్రజావేదిక ,ఆన్‌లైన్‌లలో ఉన్నతాధికారుల ద్వారా వచ్చిన 285 అర్జీలు పరిష్కరించాల్సి ఉందన్నారు. పోలీస్ శాఖ 61, విద్యుత్ శాఖ 31, రెవెన్యూ శాఖ 65, పంచాయితీ రాజ్ 28, వ్యవసాయ శాఖ 6, ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం అయ్యే అర్జీలు జిల్లా కేంద్రానికి రావడం, ఒకే ఫిర్యాదు పలు సార్లు రావడం గుర్తించామన్నారు. భూములు, సర్వే, విభజన మ్యుటేషన్ ,వితంతు ,వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్ల కోసం ,రేషన్ కార్డులు తదితర అంశాలపై అర్జీలు వస్తున్నాయని తెలిపారు.పీజీఆర్ఎస్ మధ్యలో ప్రత్యేక అవసరాల వృద్ధులకు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు వీల్ ఛైర్స్,10 వినికిడి యంత్ర పరికరాలను కలెక్టర్ ప్రశాంతి ,జేసి చిన్నరాముడు అందించారు. అనంతరం అర్జీలు స్వీకరించారు. రాజమహేంద్రవరంలో ఈట్ స్ట్రీట్ తొలగించాలని దళిత గిరిజన ప్రజాసంఘాల కన్వీనర్ మర్రి బాబ్జి , కోకన్వీనర్లు కాశి నవీన్ కుమార్, సుబ్బారావు, తాళ్ళూరి రాజేంద్రప్రసాద్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.దీనిపై నివేదిక ఇవ్వాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో టి.సీతారామమూర్తి , డీఎస్పీ భవ్యకిషోర్, సీపీవో ఎల్.అప్పల కొండా, డీఎల్‌డీవో వీణాదేవి అధికారులు పాల్గొన్నారు.



అమ్మో.. సమిశ్రగూడెం బ్రిడ్జి

- నిత్యం వేధిస్తున్న ట్రాఫిక్ జామ్
- పట్టించుకోని అధికారులు



బ్రిడ్జిపై పదుల సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు

నిడదవోలు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వాహనదారులు సమిశ్రగూడెం బ్రిడ్జి పేరు చెబితే హడలిపోతున్నారు. దీనికి కారణం నిత్యం ట్రాఫిక్ జామ్ సమస్యే. బ్రిడ్జిపై భారీ వాహనాలకు నిషేధం ఉన్నా... సందిట్లో సడేమియాగా రాకపోకలు సాగిస్తుండడం విడ్డూరం. అసలే వేసవికాలం కావడంతో ఒకవేళ ట్రాఫిక్ జామ్ అయితే వృద్ధులు, చిన్నారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

గౌరవ భత్యం చెల్లించాలని వినతి



ఇన్‌చార్జి తహశీల్దార్‌కి వినతిపత్రం అందిస్తున్న పోలింగ్ కేంద్రాల సూపర్‌వైజర్లు

తాళ్లపూడి, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): గత నాలుగు సంవత్సరాలుగా ఎన్నికల విధుల్లో ఉన్నప్పటికీ తమకు జీతాలు చెల్లించడం లేదని పోలింగ్ కేంద్రాల సూపర్‌వైజర్లు వాపోయారు. ఈమేరకు ఏఎస్‌వో జోడాల వెంకటే శ్వరరావు ఆధ్వర్యంలో ప్రజాగ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. డివి జన్, జిల్లాలో పనిచేసిన వారికి రావా ల్సిన గౌరవభత్యం వెంటనే చెల్లించా లని ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతికి వినతిపత్రం అందించారు. ఆర్ఐ రామకృష్ణ, సూపర్‌వైజర్లు మల్లేశ్వరరావు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

మదనగోపాలుడి 139వ కల్యాణ మహోత్సవం



ఆలయంలో తులాభారం నిర్వహిస్తున్న భక్తులు

తాళ్లపూడి, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): తాళ్లపూడిలో వేంచేసియున్న రుక్మిణీ, సత్య భామ సమేత మదన గోపాలస్వామి 139వ కల్యాణ మహో త్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం దేవాలయంలో చిన్నారులకు తులాభారాన్ని ఏర్పాటు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సా యంత్రం నాలుగు గంటలకు హిం దూపురం ఇస్కాన్ ఇన్‌చార్జి శ్రీకృష్ణ మాధవదాస్ ప్రభుచే భగవద్గీత ప్రవచనాలను వినిపించారు. సాయంత్ర 5.30 గంటల నుంచి సంకల్పం, విశ్వక్సేన పూజ అనంతరం స్వామివారి కల్యాణం జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మంగళ వారం సాయంత్రం స్వామివారి రథోత్సం జరుగుతుందని, బుధవారం ఉదయం 11 గంటల నుంచి భారీ అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు పీడీఎస్ బియ్యానికి వేలం పాట

గోపాలపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వివిధ చోట్ల నుంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడిన పీడీఎస్ బియ్యానికి మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు సీఎస్‌డీటీ దివాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద 47.274 మెట్రిక్ టన్నుల బియ్యానికి వేలం వేస్తున్నట్టు చెప్పా రు. జిల్లా పౌరసరఫరాల శాఖ షరతులకు లోబడి పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

రేపటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంజీవ పురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనవిద్యుత్ లైన్ నిర్మాణంలో భాగంగా బుధవారం నుంచి శుక్ర వారం వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సర ఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ నారాయణ అప్పా రావు ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీల అరెస్టు తగదు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు



నిడదవోలు రైల్వేస్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కొవ్వూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తమకు కనీస వేతనాలు అమలుచేయాలని కోరుతూ విజయవాడలో జరిగే శాంతియుత ధర్నాకు వెళ్తున్న అంగన్వాడీలను మార్గమధ్యలో పోలీ సులు అక్రమ అరెస్టు చేయడాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందరబాబు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గత వైసీపీ ప్రభుత్వంలో చారిత్రకంగా 42 రోజులు సమ్మె చేపట్టారన్నారు. ఆ సమ యంలో కూటమి నాయకులు సమ్మె శిబిరాలను సందర్శించి అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడేమో శాంతయుత ధర్నాకు వెళ్తున్న కార్య కర్తలను అరెస్టులు చేయడం ఎంతవరకు సబ బని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్నా.. ఇంకా జీతాలు పెం చకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంగన్వాడీలకు గ్రాట్యుటీ చట్టాన్ని అమలుచేయకుండా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ప్రక టించి చేతులు దులుపుకోవడం సరైంది కాద న్నారు. తక్షణం అంగన్వాడీలకు రూ. 26 వేలు కనీస వేతనం చెల్లించాలని, మొబైల్ యాప్‌ల పనిభారం తగ్గించాలని, గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, మినిట్స్‌లో అంగీకరించిన అంశాలన్నింటికీ జీవోలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నిడదవోలు: ఛలో విజయవాడకు తరలివెళ తున్న అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకోవడం దారుణమని సీపీఎం నేత జువ్వల రాంబాబు అన్నారు. సోమవారం నిడదవోలు రైల్వేస్టేషన్‌లో విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీలను అదు పులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రైల్వేస్టేష న్ బయట వారంతా నిరసన వ్యక్తం చేశారు. రాంబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనా ల పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి ఛలో విజయవాడకు వెళుతున్న మమ్మల్ని అదుపులోకి తీసుకోవడం నిరంకుశ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్య కర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి కృషిచేయాలి : ఆర్డీవో



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మీ కోసం అర్జీల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆర్డీవో డా. రాణీసుస్మిత సూచిం చారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాల యంలో పీజీఆర్ఎస్ - మీకోసం కార్యక్రమా న్ని నిర్వహించారు. దీనిలో భాగంగా డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆరు ఫిర్యాదులను స్వీకరిం చారు. ఆర్డీవో రాణీసుస్మిత మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదుల పరి ష్కారానికి డివిజన్‌స్థాయి అధికారులు చర్య లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్ చార్జి ఏవో కే. రవివిక్రమ్, డివిజన్, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట



శంకుస్థాపన చేస్తున్న దేవికారాణి

పెరవలి, మార్చి10 (ఆంధ్రజ్యోతి): అభివృ ద్ధికి కూటమిప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీటీసీ సభ్యురాలు కోటిపల్లి దేవికారాణి అన్నారు. సోమవారం మల్లేశ్వరంలోని ఆవుల కల్యాణమండపం పై అంతస్థు శ్లాబ్ పను లను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థా పన చేశారు. దీనికి మండల పరిషత్ నిధులు రూ. 18 లక్షలు మంజూరయ్యాయి. కార్యక్ర మంలో సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల, ఉప స ర్పంచ్ పట్టాభి, మాజీ ఎంపీపీ కోటిపల్లి మురళీకృష్ణ , కూటమి నేతలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు వైసీపీ ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న మాజీమంత్రి చెల్లుబోయిన, తదితరులు

తాళ్లపూడి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవా లని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అన్నారు. తాడిపూడిలో శివ రాత్రిరోజున గోదావరి నదిలోకి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు చనిపోయిన యువకుల కుటుం బాలకు సోమవారం ఆర్థిక సాయం చేశారు. ఒక్కో కుటుంబానికి రూ. 50 వేలు చొప్పున అందించారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నామా శ్రీనివాస్, కంఠమణి రమేష్, సుంకర వెంకటరెడ్డి, యాళ్ల బాబూ రావు, గూడా విజయరాజు, గండి రాంబాబు, మండిగ గిరిధర్, ఒంటోలు పోసిబాబు, వైసీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరుడి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



కురుకూరు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దేవరపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కురుకూరులో సోమవారం అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికో త్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమపూజలు, రుద్రా భిషేకాలు చేశారు. వేదపండి తులు పుల్లేటికుర్తి సంతోష్‌శర్మ, కొత్తలంక భగవాన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రధాన నిర్మాణ దాతలు కొయ్యలమూడి సుందర మాణిక్యవాణి, స్థలదాత, బేతిన పుల్లయ్య కుటుంబసభ్యులు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. సిం గరాజపాలెం మహిళా భక్తుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానికులు యలమాటి భాస్క రరావు, మల్లెల వెంకటేశ్వరరావు, బేతిన వెంకట్రావు, దుర్గారావు, కొయ్యలమూడి శ్రీనివా స్, కలగర భూపతిరావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం ఎస్సీ హాస్టల్‌లో పూలే వర్ధంతి



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ హాస్టల్‌లో సోమవారం సావిత్రీ బాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. ఆల్ ఇండియా పూలే అంబేడ్కర్ ఫౌండేషన్ వ్యవస్థా పకుడు, న్యాయవాది పొట్ల సురేష్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి ఎస్ఐ జి. శ్రీనివాసరావు పూలమాల వేసి నివా ళులర్పించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ ప్రతిఒక్కరూ పూలే అడుగుజాడల్లో నడవాలన్నారు. అప్పుడే మనం నిజమైన నివాళి సమర్పిస్తున్నట్టు అవుతుందన్నారు. కార్యక్రమంలో భమిడి శాస్త్రి, సుధీర్, హాస్టల్ సిబ్బంది, ఫౌండేషన్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

- ఎంపీడీవో కేఎస్ఎస్ శ్రీనివాస్



గోపాలపురంలో తడి, పొడి చెత్తను సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

గోపాలపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి వ్యక్తిగత బాధ్యత అని ఎంపీడీవో కేఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. గోపాలపురంలో సోమవారం ప్రత్యేక పారిశుధ్యపనులు నిర్వహించారు. ఈ సంద ర్భంగా పంచాయతీ సిబ్బందితో తడి, పొడి చెత్తను సేకరించి, వాటిని ఉపయోగించి చెత్త నుంచి సంపద తయారీ ఎలా చేయాలో అన్నదానిపై ప్రజలకు వివరించారు. కార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మి కులు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన ప్లీనరీని విజయవంతం చేయండి

- గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు



కరపత్రాలు విడుదల చేస్తున్న సువర్ణరాజు, తదితరులు

గోపాలపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో జరిగే జనసేన పార్టీ ప్లీనరీ విజయవంతం చేయాలని గోపాలపురం నియోజకవర్గ ఇన్ ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జనసేన గ్రామకమిటీ అధ్య క్షుడు వడ్డి రామలీలాధర్ అధ్యక్షతన జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం సన్నాహక సమావేశాన్ని నిర్వ హించారు. పార్టీ మండల అధ్యక్షుడు పోల్నా టి రాజేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సువర్ణరాజు మా ట్లాడుతూ ప్లీనరీకి తరలివెళ్లేందుకు మండ లానికి రెండు బస్సులు చొప్పున ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. అనంతరం పలు వురు మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కాశీవిశ్వనాథ్ సనారి, ఉపా ధ్యక్షుడు పోసిన గణపతి, రాంబాబు, ఉమా మహేశ్వరరావు, షేక్ బద్రి, సుహాని, శివ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నమో నారసింహాయ

- వైభవంగా బ్రహ్మోత్సవాలు
- గోవిందనామంతో పులకించిన కోరుకొండ
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



కోరుకొండలో లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



కోనేటి స్నానమాచరిస్తున్న భక్తులు

కోరుకొండ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చారిత్రా త్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారం భమయ్యాయి. కొండపైన, దిగువున స్వామి వారు ప్రత్యేక ఆభరణాలు, అలంకరణలతో భక్త లకు దర్శనమిచ్చారు. ఉదయం 5గంటల నుంచే భక్తులు స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. కొండ ఎక్కలేని భక్తులకు స్వామి వారి పాదాల వద్ద పానకం పోసి, కొబ్బరి కాయలు కొట్టారు. మరికొందరు కొండపైకి వెళ్లి స్వయం భూ నరసింహస్వామిని దర్శించుకున్నారు. దిగు వ దేవస్థానం ధ్వజస్తంభం వద్ద భక్తులు ఆవునె య్యి, ఒత్తితో పొన్నచెట్టు దీపాలు వెలిగించారు. పెద్దపెద్ద మట్టి మూకుడులో మంచి నూనె వేసి దీపాలు వెలిగించారు. అంతకుముందు దేవుని కోనేటి వద్ద పుణ్యస్నానాలు చేసి దీపాలు వెలి గించారు. మహిళలు కొండ పొడవునా 615 మెట్లకు పసుపు రాసి బొట్టు పెట్టుకుంటూ పైకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవా లను తిలకించేందుకు వచ్చే భక్తులకు ఉదయం, సాయంత్రం స్థానిక మిరియాల వెంకటరెడ్డి పంతులు ధర్మసత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు. 5 రోజుల పాటు భక్తులందరికీ అన్నదానం చేస్తామని సత్రం ఈవో తెలిపారు.

● వైభవంగా నరసన్న రథోత్సవం

నరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం జరిగిన రథోత్సవాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అన్నవరం దేవ స్థానం ఈవో వీర్ల సుబ్బారావు, వ్యవస్థాపక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, ఇతర అధికారులు, నాయకులు ప్రారంభించారు. అంతకు ముందు స్వా మి వారిని, అమ్మవారిని పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంక రించి మధ్యాహ్నం 1.56 గంటలకు రథోత్సవం ప్రారంభించారు. పండితులు రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోవిందా గోవిందా అంటూ భక్తజనం రథాన్ని లాగారు. రథానికి ముందు పండితుల వేద గోష, భజనలు, గరగ , కోలాటనృత్యాలు, మంగ ళవాయిద్యాలు, మేళతాళాలు ఆకట్టుకున్నాయి. 250 మంది స్వామి మాలధారులు జెండాలతో రథం ముందు నడిచారు. రథం సాయంత్రం 6గంటలకు స్వామి దిగువ దేవస్థానానికి చేరిం ది. ఈ సందర్భంగా అనేక మంది భక్తులు స్వ చ్ఛందంగా మజ్జిగ, మంచినీరు, ప్రసాదాలు



శ్రీ లక్ష్మీనరసింహస్వామి

పంపిణీ చేశా రు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్ఐ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవంలో రుడా ఛైర్మన్ బొడ్డు వెంక టరమణ చౌదరి, టీడీపీ నాయకులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశవరావు, కటకం చలం, జనసేన నాయకులు బదిరెడ్డి దొర, సర్పంచ్ కర్రి లక్ష్మీనరోజ, బీజేపీ ఇన్‌చార్జి నీరు కొండ వీరన్న చౌదరి, మాజీఎమ్మెల్యే జక్కం పూడి రాజా పాల్గొన్నారు.

● నేటి కార్యక్రమాలు

నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం కొండ పైన, దిగువున స్వామివారి సర్వదర్శనం ఉంటుంది. ఉదయం 9 గంటలకు సేవాకాలం, రాత్రి 8గంటలకు గరుడ వాహనంపై గ్రామో త్సవం జరుగుతుంది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి కళావేదికపై కూచిపూడి నృత్యప్రదర్శన, శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ఉదయం, సాయంత్రం పండిత సభలు జరుగ నున్నాయి.

కఠిన శిక్షలు అమలు చేయాల్సిందే..



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ షఫీకా కుమారి

దేవరపల్లి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహి ళలపై జరుగుతున్న అత్యాచారాలు, దురాగ తాలపై కఠినశిక్షలు అమలు చేయాలని సావిత్రీ బాయిపూలే స్త్రీ శక్తి మహిళా సం ఘం రాష్ట్ర అధ్యక్షురాలు షేక్ షఫీకా కుమారి డిమాండ్ చేశారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మహిళలపై రోజు రోజుకు అత్యాచారాలు పెరిగిపోతున్నా యని, అందుకు మనదేశంలో సరైన శిక్షలు లేకపోవ డమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈమెతో పాటు సీపీఐ ఎంఎల్ ప్రజా పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలింపూడి సుం దరరావు, సీపీఐ ఎంఎల్ ప్రజాపోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామన సత్యనారా యణ, దూమంతనగూడెం సర్పంచ్ మెంతెం మరియమ్మ, సీపీఐ ఎంఎల్ ప్రజాపోరాట సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి షేక్‌షహెన్న, తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పెన్నులు, స్కేళ్లు పంపిణీ



తాడిపర్రులో విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రు హైస్కూల్ పూర్వ విద్యార్థి, వెలగ దుర్రుకి చెందిన వీరవల్లి సాయికృష్ణ పదోతర గతి చదువుతున్న 60 మంది విద్యార్థులకు సోమవారం పెన్నులు, స్కేళ్లు పంపిణీ చేశా రు. వీటిని తమ బంధువుల ద్వారా అందజే శారు. ప్రస్తుతం ఈయన సిపాయిగా దేశా నికి సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా సాయికృష్ణను ఉపాధ్యాయులు, విద్యార్థులు, తలిదండ్రులు అభినందించారు. ప్రధానోపా ధ్యాయురాలు కే. సరోజిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.

రేపు రైల్వే జీఎం రాక

రాజమహేంద్రవరం, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ బుధవారం రాజమండ్రి రానున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కాకినాడలో బయలుదేరి ట్రాక్, పాయింట్లు, తదితర అంశాలను పరిశీలిస్తారు.

హోంగార్డుపై ఎస్ఐ ప్రతాపం

- దొంగతనం అంటగట్టాలని ప్రయత్నం
- నేరం ఒప్పుకోవాలని తీవ్ర ఒత్తిడి
- తీరా అతడు కాదని తేలడంతో వదిలివేసిన వైనం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఉదంతం?



ఎస్ఐ యూనిఫాంలో డ్రైవర్ నుంచి దోపిడీకి పాల్పడిన నిందితుడు

రాజమహేంద్రవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): లారీని ఎస్ఐ వేషంలో బెదిరించి డబ్బులు వసూలు చేశాడనే అనుమానంతో ఒక హోంగా ర్డును విచారణ పేరుతో ఒక ఎస్ఐ చితకబాదిన వైనం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈనెల 2న తెల్లవారుజామున రాజమహేంద్రవరం సమీపం లోని కాతేరు బ్రిడ్జిపై చిత్తూరు వెళుతున్న ఓ లారీని పోలీసు అంటూ ఓ వ్యక్తి ఎస్ఐ దుస్తుల్లో అటకాయించాడు. డ్రైవరును బెదిరించి.. బైక్‌పై ఎక్కించుకొని పేపరుమిల్లు సమీపంలోని ఓ ఏటీఎంకి తీసుకెళ్లాడు. డ్రైవరుతో రూ.10 వేలు డ్రా చేయించి తీసుకొని అతడిని లారీ వద్ద దింపేశాడు. ఈ విషయం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ వరకూ వెళ్లడంతో త్రీటౌన్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో త్రీటౌన్ పోలీ సులు దర్యాప్తు వేగం చేశారు. సీసీ ఫుటేజీ లను పరిశీలించారు. ఓ హోంగార్డు మాదిరిగా ఆ ఫుటేజీలోని వ్యక్తి కనబడడంతో ఆ హోంగార్డును ఇంటికెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడికి తీసుకువెళుతున్నారో ఇంట్లో కుటుంబ సభ్యులకు కూడా చెప్పలేదు. ఆ హోంగార్డు సుమారు 18 ఏళ్ల నుంచి పని చేస్తున్నాడు. అతడిని పోలీసుల వార్‌రూమ్‌కు అంటే నిందితులను చితక్కొట్టే ప్రదేశానికి తీసుకెళ్లారు. ఓ ఎస్ఐ వచ్చి సదరు హోంగార్డును నానా బూతులు తిట్టారు. భౌతిక దాడికీ దిగాడు. నేరం ఒప్పుకోవాలని తీవ్ర ఒత్తిడి చేశాడు. ఈలోపు ఆరుగురు పోలీసులు జీపులో ఆ హోంగార్డు ఇంటికెళ్లి, ఎలాంటి ఉత్తర్వులూ చూపకుండా ఇంట్లో సోదాలు చేశారు. హోం గార్డు తల్లిని, చిన్న పిల్లాడిని బెంబేలెత్తించారు. అయితే అసలు దొంగ దొరికాడని సమాచారం రావడంతో రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఆ హోంగార్డుకు సర్ది చెప్పి పంపేశారు. ఆ సమ యంలో కూడా ఆ హోంగార్డుతో ఒట్టు వేయిం చుకున్నారు. చిరుద్యోగి కావడంతో అధికారులను ప్రశ్నించలేక రోదిస్తూ ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం హోంగార్డు కార్యాలయానికి అతడిని అటాచ్ చేశారు.